PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 85 | విజయవాడ, గురువారం 26 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 26 October 2023 | Rs

బిజెపి చేతిలో కీలుబొమ్మలు కావద్దు

- వైసిపి, టిడిపి, జనసేనలకు సిపిఎం హితవు
- 'ప్రజారక్షణ భేరి' బహిరంగ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

2

మ్యాక్స్‌వెల్ విధ్వంసం



- 40 బంతుల్లోనే సెంచరీతో రికార్డు
- నెదర్లాండ్స్‌పై 309 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు


6

మళ్లీ 'భారత్' వివాదం

పాఠ్య పుస్తకాల్లో మార్పునకు ప్రతిపాదన

విమర్శల వెల్లువ.. తుది నిర్ణయం తీసుకోలేదన్న ఎన్‌సిఇఆర్‌టి

న్యూఢిల్లీ : ఇండియా-భారత్ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. పాఠశాల విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో ఇండియాకు బదులుగా భారత్‌ను ఉపయోగించాలన్న ప్రతిపాదన తాజాగా ముందుకు వచ్చింది. సిలబస్ మార్పునకు సంబంధించి జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎన్‌సిఇఆర్‌టి) ఏర్పాటు చేసిన ఒక ఉన్నతస్థాయి కమిటీ ఈ మేరకు సిఫార్సు చేయడం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకటవుతున్న ప్రతిపక్షాలు తమ వేదికకు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయెన్స్ (ఇండియా) అని పేరు పెట్టుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుండి దేశం పేరును భారత్‌గా మార్చడానికి మోడీ సర్కారు ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు కూడా ఈ దిశలో ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే జి20 శిఖరాగ్ర సమావేశాల్లో ఆహ్వానాలు మొదలుకొని నేమ్‌బోర్డ్స్ వరకూ 'భారత్' పేరును కేంద్రం రుద్దిన విషయం తెలిసిందే. తాజాగా చరిత్రకారుడిగా కన్నా ఆర్‌ఎస్‌ఎస్ సిద్దాంతకర్తగా ఎక్కువ ప్రాచుర్యం పొందిన సిఐ ఐజాక్ నేతృత్వంలో సాంఘిక శాస్త్రానికి సంబంధించి ఎన్‌సిఇఆర్‌టి ఏర్పాటు చేసిన కమిటీ ఈ ప్రతిపాదన చేసింది. ఈ విషయాన్ని స్వయంగా మీడియాకు వెల్లడించారు. 'ఇండియా స్థానంలో భారత్ పదాన్ని ఉపయోగించాలని ప్రతిపాదించాం' అని ఆయన పేర్కొన్నారు. దీంతో పిల్లల మెదళ్లలోనైనా ఇండియాకు బదులుగా భారత్ పేరును బలవంతంగా రుద్దడానికి మోడీ సర్కారు. ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ప్రయత్నిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు, విద్యావేత్తలు,



చరిత్రకారుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో 'ఇంకా నిర్ణయం తీసుకోలేదని, అందువల్ల ఇప్పుడు స్పందించ డం తొందరపాటు అవుతుంది' అని ఎన్‌సిఇఆర్‌టి స్పందించింది. దీంతో భవిష్య త్తులో ఈ రకమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇప్పుడే వ్యాఖ్యానించలేం : ఎన్‌సిఇఆర్‌టి

ఇండియా బదులు భారత్ అనే పదాన్నే పాఠ్య పుస్తకాల్లో ఉపయోగించాలన్న ప్రతిపాదనకు సామాజిక శాస్త్రాల కరిక్యులమ్ ప్యానెల్ ఆమోదముద్ర వేసిందన్న కథనాలను ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లాని ఖండించారు. 'అది ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అందువల్ల ఇప్పుడే వ్యాఖ్యానించడం సరికాదు' అని ఆయన పేర్కొన్నారు.

ఐజాక్ ఏం చెప్పారు?

పాఠ్య పుస్తకాల్లో పాఠశాల విద్యార్థులకు ఇండియా బదులు భారత్ అనే పదాన్నే బోధించాలని కమిటీ ప్రత్యేకంగా సిఫారసు చేసిందని ఐజాక్ తెలిపారు. 'భారత్ అనే పేరును విష్ణు పురాణంలో ప్రస్తావించారు. కాళిదాసు కూడా భారత్ అనే మాటను ఉపయోగించారు. అది పురాతన పేరు. తుర్కులు, ఆఫ్ఘన్లు, గ్రీకుల దాడి తర్వాత ఇండియా అనే పేరు వాడారు. సింధు నది ఆధారంగా వారు భారత్‌ను గుర్తించారు. దీనిని మార్చాలని ప్రతిపాదించాం. 12వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాల్లో భారత్ అనే పేరును ఉపయోగించాలని నేను గట్టిగా చెప్పాను. ఇతర సభ్యులు దీనికి అంగీకరించారు. ఇది కమిటీ ఏకగ్రీవ అభిప్రాయం' అని ఆయన తెలిపారు. అలాగే ప్రాచీన చరిత్రను సాంప్రదాయక చరిత్రగా పేర్కొనాలని, హిందూ రాజులు సాధించిన విజయాలను ఎక్కువగా వివరించాలని కూడా సిఫార్సు చేసినట్లు తెలిపారు.



ఎవరీ ఐజాక్

ఐజాక్ కేంద్ర విద్యా శాఖకు చెందిన భారతీయ చారిత్రక పరిశోధనా మండలిలో సభ్యుడు. కొట్టాయంలోని సిఎంఎస్ కాలేజీలో చరిత్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేశారు. 1975లో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ ఎబివిపిలో చేరారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధమున్న భారతీయ విచార కేంద్రం కేరళ రాష్ట్ర విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కమిటీ సభ్యుడైన జెఎన్‌యు ప్రొఫెసర్ వందనా మిశ్రా ఎబివిపి మాజీ జాతీయ కార్యదర్శిగా, ఆ సంస్థకు జాతీయ ఉపాధ్యక్షులుగా పనిచేశారు. వివిధ విషయాలకు సంబంధించి పాఠ్యప్రణాళిక స్థితిని సమీక్షించేందుకు 2021లో ఎన్‌సిఇఆర్‌టి ఏర్పాటు చేసిన 25 ఉన్నతస్థాయి కమిటీల్లో ఐజాక్ కమిటీ ఒకటి.



'నిజం గెలవాలి' సభకు హాజరైన మహిళలు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

'నిజం' ఎప్పటికైనా 'గెలుస్తుంది'

మృతుల కుటుంబాలకు నారా భువనేశ్వరి పరామర్శ, ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'నారావారిపల్లికి నేను వచ్చి రెండు రోజులైంది. మా గ్రామంలో కుటుంబంతో సంతోషంగా గడిపిన క్షణాలు గుర్తుకొచ్చి నా గుండె పిండేసింది. ఇలా మొదటిసారి పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడుతున్నా. నిజం గెలవాలి అనే పోరాటం నా ఒక్కరిదే కాదు... మనందరిదీ. మన బిడ్డలు, భావితరాల కోసం ఈ పోరాటం. అసలు ఈ రాష్ట్రంలో పరిపాలన ఉందా? చేయిచేయి కలుపుదాం. ఈ రాష్ట్రాన్ని రక్షించుకుందాం' అంటూ చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి భావోద్వేగంతో మాట్లాడారు. నిజం ఈ రోజు కాకపోయినా రేపైనా గెలిచి తీరుతుందని వక్కాణించారు. 'నిజం గెలవాలి' యాత్రను తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం అగరాల వద్ద బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆమె ప్రారంభించారు. అంతకుముందు తన సొంతూరు నారావారిపల్లిలో తన తండ్రి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 11 గంటలకు ఆమె అక్కడి నుంచి బయల్దేరారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక భావోద్వేగానికి గురై గుండెపోటుతో మృతి చెందిన పాకాల మండలం నేంద్రగుంటకు చెందిన కనుమూరి చిన్నబ్బనాయుడు, చంద్రగిరి మండలం ప్రవీణ్‌రెడ్డి కుటుంబ సభ్యులను భువనేశ్వరి ఓదార్చారు. ఎన్‌టిఆర్ ట్రస్టు నుంచి రూ.3 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. అగరాల వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి ఐదువేల మందిపైగా మహిళలు హాజరయ్యారు. నారా భువనేశ్వరి భావోద్వేగంతో మాట్లాడిన సందర్భంగా మహిళలు కంట తడిపెట్టారు. ఎలాంటి ఆధారమూ లేకుండా తన భర్తను రాజమండ్రి సెంట్రల్ జైల్లో నిర్బంధించారని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తొలుత రూ.3 వేల కోట్లు అవినీతి జరిగిందని, ఆ తరువాత రూ.350 కోట్లని, ఇప్పుడు 25 కోట్లని చెబుతున్నారు తప్ప ఎక్కడా ఆధారాలు చూపించిన దాఖలా లేదని ఆమె అన్నారు. జైల్లో బంధించింది చంద్రబాబును కాదని... రాష్ట్రాన్ని, న్యాయాన్ని బంధించారని అభివర్ణించారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో హత్యలు, గంజాయి, అత్యాచారాలు, అక్రమ కేసులు, అరాచకాలే కనిపిస్తున్నాయని విమర్శించారు. అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదన్నారు. మానసికంగా చంద్రబాబును ఇబ్బంది పెడితే టిడిపి కేడర్‌ను దెబ్బతీయొచ్చని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఇవ్వాళ కాకపోయినా రేపైనా ఆయన .మిగతా 2లో

గాజాలో స్థంభించిన

ఆరోగ్య వ్యవస్థ

ఇజ్రాయిల్ దాడులకు 6,546 మంది బలి

గాజా : గాజాపై ఇజ్రాయిల్ నిరంతరంగా కొనసాగిస్తున్న బాంబు దాడులు, వైద్య సరఫరాలు, సిబ్బంది, ఇంధన కొరత కారణంగా మొత్తంగా గాజాలో ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిందని పాలస్తీనా ఆరోగ్యశాఖ ప్రతినిధి తెలిపారు. తక్షణమే ఈ వ్యవస్థ పునరుద్ధరణకు జోక్యం చేసుకోవాల్సిందిగా ఆయన అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. ఈ పరిస్థితులపై తాము ఎన్ని హెచ్చరికలు చేసినా ప్రపంచ దేశాలు పట్టించుకోవడం లేదని అన్నారు. గాజాలో 30 శాతానికి పైగా ఆస్పత్రులు మూత పడ్డాయని ఐక్యరాజ్య సమితి ఇప్పటికే ప్రకటించింది. ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో మూడింట రెండు వంతులు మూతపడ్డాయని తెలిపింది. బాంబు దాడులతో ధ్వంసం కావడం, ఇంధన కొరత కారణంగా ఈ పరిస్థితులు తలెత్తాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఇజ్రాయిల్ బాంబు దాడులతో గాజా పొరుగు ప్రాంతాలన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. అక్కడ జీవన పరిస్థితులన్నీ అస్తవ్యస్థంగా మారాయి. ఆసుపత్రుల్లో జనరేటర్లకు అవసరమైన ఇంధనాన్ని సైతం ఇజ్రాయిల్ అడ్డుకుంటోంది. దీంతో ఇప్పటికే దాదాపు అన్ని ఆసుపత్రుల్లోనూ ఇంధన నిల్వలు నిండుకున్నాయి. ప్రాణాధార మందులు, పాలు, టీకాలు, వైద్య పరికరాల సరఫరాలను సైతం అడ్డుకోవడంతో గాజాలోని అన్ని ఆసుపత్రుల్లోనూ హాహాకారాలు మిన్నంటుతున్నాయి. అరకొర సదుపాయాల నడుమే ఉన్నంతలో వైద్యులు సేవలందిస్తున్నా.. జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం తక్షణమే జోక్యం చేసుకొని ఇజ్రాయిల్ అడ్డు తప్పించాలని పాలస్తీనా విజ్ఞప్తి చేస్తోంది. ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, మానవ హక్కుల సంఘాలు కూడా ఇప్పటికే అంతర్జాతీయ సాయాన్ని కోరుతూ విన్నపాలు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ఇజ్రాయిల్ వైమానిక దాడులను బుధవారం కూడా కొనసాగించింది. ఆసుపత్రులు, పౌరుల నివాసాలు అని తేడా లేకుండా యథేచ్ఛగా దాడులకు తెగబడుతోంది. దీంతో వందలాది మంది నేలకొరుగుతున్నారు. బుధవారానికి గత 24 గంటల్లో 756 మంది చనిపో యారు. దీంతో ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటి వరకు గాజాలో చనిపోయినవారి సంఖ్య 6,546కి మిగతా 5లో

దేవరగట్టు ఉత్సవంలో విషాదం

- తొక్కిసలాటలో ఇద్దరు, చెట్టుకొమ్మ విరిగి ఒకరు మృతి
- కర్రల సమరం, అగ్ని దివిటీల వల్ల 105 మందికి తీవ్రగాయాలు
- నిలువరించడంలో పోలీసుల ప్రేక్షక పాత్ర

ప్రజాశక్తి- హోళగుంద

దేవరగట్టు బన్నీ ఉత్సవాలను పోలీసులు ప్రశాంతంగా నిర్వహించలేకపోయారు. ఈ ఉత్సవాల్లో రక్తం చిందింది. కర్రలు కరాళ నృత్యం చేశాయి. తొక్కిసలాటలో ఊపిరాడక ఇద్దరు, చెట్టుకొమ్మ విరిగి మరొకరు... మొత్తం ముగ్గురు మృతి చెందారు. ఉత్సవ విగ్రహాలను దక్కించుకోవడానికి రింగ్ కర్రలతో భక్తుల మధ్య సమరం, అగ్ని దివిటీల ఆవిరికి మొత్తం 105 మంది గాయపడ్డారు. వారిలో 11 మందికి తీవ్రగాయాలు కావడంతో వారిని మెరుగైన చికిత్స కోసం ఆలూరు, ఆదోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కర్నూలు జిల్లా హోళగుంద మండలం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలసిన దేవరగట్టు శ్రీమాల మల్లేశ్వర స్వామి జైత్రయాత్ర (కర్రల సమరం) మంగళవారం అర్ధరాత్రి జరిగింది. భారీగా పోలీసు బందోబస్తు నిర్వహించారు. రింగ్ కర్రలను తీసుకురావద్దని నిషేధాజ్ఞలు విధించారు. అయినా, రింగ్ కర్రలను దేవరగట్టుకు తీసుకొని రానీయకుండా పోలీసులు ఆపలేకపోయారు. శ్రీమాల మల్లేశ్వరస్వామి జైత్రయాత్రలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాల బండకు చేరుకున్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో కలిసికట్టుగా ఉండాలని, పాత కక్షలు పెట్టుకోకూడదని పాలతో బాస చేసుకున్నారు.

అనంతరం మూడు అవుట్లు వదిలి 'డుర్ర్ గో పరాక్.. మాల మల్లేశ్వర బహు పరాక్' అంటూ నినాదాలు చేసి మాల మల్లేశ్వర సన్నిధికి చేరుకున్నారు. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా యుద్ధ వాతావరణాన్ని తలపించింది. అక్కడి నుంచి కొండ గిరిపైకి వెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీమాల మల్లేశ్వరులకు వివాహం జరిపించారు. అనంతరం జైత్రయాత్రలో భాగంగా శ్రీమాల మల్లేశ్వరుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ సమయంలో విగ్రహ మూర్తులను దక్కించుకోవాలని అరికెర, బిలేహాళ్, ఆలూరు, కురుకుంద, ముద్దనగేరి, కరిడిగుడ్డం, సులువాయి, ఎల్లార్తి, హెబ్బటం, మిగతా 2లో

పరిశ్రమ పెట్టండి.. లేదా భూములు వెనక్కివ్వండి

- జింక్ ఇండస్ట్రీ భూ పరిరక్షణ రైతు కమిటీ డిమాండ్
- '350 ఎకరాల స్వాహా'పై జింక్ భూ రైతులు, పారిశ్రామిక వర్గాల్లో చర్చ!


• లోపలి పేజీలో.. •

నిరుద్యోగ భారత్

- పొరుగు దేశాల కంటే ఇక్కడే అధికం
- ప్రపంచబ్యాంక్ నివేదిక

అదాని గ్రూప్ ఆడిటర్ 'ఇవై'పై విచారణ..!

న్యూఢిల్లీ : అదాని గ్రూపు కంపెనీలకు దీర్ఘకాలం ఆడిటర్‌గా వ్యవహరించిన 'ఇవై' సంస్థపై భారత అకౌంటింగ్ రెగ్యులేటరీ విచారణ ప్రారంభించిందని సమాచారం. కొద్ది వారాల క్రితం నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్‌ఎఫ్‌ఆర్‌ఎ) ఇవై సంస్థకు చెందిన భారత సంస్థ ఎస్‌ఆర్ బాట్లిబోయిపై విచారణ చేపట్టిందని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ఎన్‌ఎఫ్‌ఆర్‌ఎ విచారణకు ఎంత సమయం పట్టవచ్చు లేదా ఆడిటర్, అదాని కంపెనీలు ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనేది అస్పష్టంగా ఉంది. ఈ అంశంపై స్పందించేందుకు ఇవై, ఎస్‌ఆర్ బాట్లిబోయి ప్రతినిధులు నిరాకరించారు. అదాని గ్రూపులోని ఐదు లిస్టెడ్ కంపెనీలు మొత్తం ఉత్పత్తిలో సగం రెవెన్యూను కలిగి ఉన్నాయి. వాటికి ఎస్‌ఆర్ బాట్లిబోయి ఆడిటర్ సేవలను అందిస్తున్నాయి. అదాని గ్రూపు భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడిందని పేర్కొంటూ ఈ ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక విడుదల చేయగా, ఆ ఆరోపణలను అదాని ఖండించింది. ఆరోపణలపై సెబీతో సుప్రీంకోర్టు విచారణ జరిపిస్తోంది. ఇది ఆడిటర్ల పారదర్శకతపై మరింత ఒత్తిడి పెంచింది. ఈ పరిస్థితుల్లో బాట్లిబోయిపై విచారణ చర్చనీయాంశమైంది.



అమిత్‌షాతో పవన్ కల్యాణ్, మనోహర్

అమిత్‌షాతో పవన్ భేటీ

- తెలంగాణ సీట్ల విషయమై చర్చ
- చంద్రబాబు అరెస్ట్ విషయం ప్రస్తావన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి అధిష్టానంనుంచి పిలుపు రావడంతో పవన్‌కల్యాణ్ హైదరాబాద్‌నుంచి హుటాహుటిన ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో బుధవారం సాయంత్రం సమావేశమైనారు. అమిత్‌షా నివాసంలో సుమారు 40 నిమిషాలు ఈ సమావేశం జరిగింది ఈ భేటీలో నాదెండ్ల మనోహర్, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ పాల్గొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తెలంగాణ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు గురించి ఈ సమావేశంలో చర్చ జరిగింది. కనీసం 20 స్థానాల్లో జనసేన పోటీ చేయాలని భావిస్తున్నట్లు, అందులో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో అత్యధిక స్థానాలు తమకు కేటాయించాలని పవన్‌కల్యాణ్ అమిత్‌షాను కోరినట్లు సమాచారం. ఈ విషయంమీద అమిత్‌షానుంచి స్పష్టమైన హామీ లభించలేదని తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో ఈ విషయమై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపితో పొత్తు ప్రకటించే సమయంలో తమను ముందస్తుగా సంప్రదించలేదన్న విషయాన్ని అమిత్‌షా ప్రస్తావించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సిఐడి అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచడం, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టడం, అధికారపార్టీ బెదిరింపుల గురించి కూడా అమిత్‌షాకు వివరించినట్లు తెలిసింది.

1 నుంచి కందిపప్పు సరఫరా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్లరేషన్‌కార్డు ఉన్న వారందరికీ నవంబరు 1 నుంచి కందిపప్పు సరఫరా చేస్తామని పౌరసరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కందిపప్పు నిల్వలు సరిపడా లేకపోవడం, జాతీయ స్థాయిలో కొరత కారణంగా నాలుగు నెలలుగా పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయలేకపోయామని వివరించారు. హెచ్‌ఎసిఎ హైదరాబాద్ సౌజన్యంతో కార్డుదారులకు కంది పప్పును కిలో రూ.67 చొప్పున పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నవంబరు నుంచి కందిపప్పు పంపిణీ ప్రతినెలా కొనసాగిస్తామని పేర్కొన్నారు. అన్ని జిల్లాలు, పట్టణ, గ్రామాల్లోని రేషన్ షాపులకు ఈ నెల 31లోపు కందిపప్పును సరఫరా చేస్తామన్నారు. జనవరి నుంచి ఎపిఎస్‌సిఎస్‌సిఎల్ విజయవాడ రైతుల నుంచి కందులు మార్కెట్ ధరకు సేకరిస్తామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఏమైనా సమస్యలుంటే 1967 టోల్‌ఫ్రీ నెంబరుకు తెలియజేయాలని కోరారు.

బీహార్‌లో బరితెగించిన భూమాఫియా

అక్రమాలను అడ్డుకున్న సిపిఎం నేత హత్య



పాట్నా : బీహార్‌లో భూమాఫియా గూండాలు రెచ్చిపోయారు. అక్రమాలను ప్రశ్నిస్తున్న ఉద్యమనేతను హత్య చేశారు. రైతుల హక్కుల కోసం, భూమిలేని నిరుపేదల కోసం అనునిత్యం పోరాడుతూ అక్రమార్కులు సాగిస్తున్న భూకబ్జాలను ప్రజలతో కలిసి అడ్డుకుంటూ పోరాటాలు సాగిస్తున్న సిపిఎం మురళీగంజ్ బ్లాక్ శాఖ కార్యదర్శి రాజేశ్ హంస్దాపై బుధవారం కొందరు భూబకాసురులు దాడి చేసి హత్య చేశారు. పనులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా దారిమధ్యలో కాపుగాసి దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టారు. రాజేశ్ హత్యను సిపిఎం తీవ్రంగా ఖండించింది. హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని బీహార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యమపథంలో అంకితభావంతో ఎనలేని పోరాటాలు చేసిన రాజేష్‌కు ఘన నివాళులర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లోని సిపిఎం అధికారిక పేజీల్లో పోస్టు చేసింది. రాజేష్ హత్యను సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంత మిశ్రా కూడా తీవ్రంగా ఖండించారు. అణగారిన ప్రజల పక్షాన ధీరోచిత పోరుసల్పిన అంకుఠిత దీక్షాపరుడు రాజేష్ అని ఆయన కొనియాడారు. ఆయన పోరాటం వృధా కానివ్వబోమని తెలిపారు. కాగా రాజేష్ హంస్దా హత్యను నిరసిస్తూ గురువారం నాడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని బీహార్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. భూమాఫియా నుంచి సామాజిక కార్యకర్తలను పరిరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పాఠశాల విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు 20 వేల మంది ఉద్యోగుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. సమగ్ర శిక్షకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 40 శాతం చెల్లించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కస్తూరిభా విద్యాలయాల్లోని సిబ్బందికి వేతనాలు 23 శాతం పెంచుతూ చేసిన నిర్ణయాన్ని అమలు చేయలేదన్నారు. కస్తూరిభా విద్యాలయాల్లో ఐదేళ్లుగా పనిచేస్తున్న పిజిటిలకు కూడా వేతనం రూ.12 వేల నుంచి పెంచాలని కోరారు. వీటిపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

సలీమకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)


సలీమ

నవ తెలంగాణ దినపత్రిక జర్నలిస్టు షేక్ సలీమకు ఆచార్య నాగార్జున యూనివర్శిటి పిహెచ్‌డిని ప్రదానం చేసింది. యూనివర్శిటీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లపల్లి స్వరూపరాణి డాక్టరేట్ పట్టాను సలీమకు అందచేశారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో 'భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల పాత్ర' అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన పత్రానికి గానూ సలీమకు పిహెచ్‌డిని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి ఈ సందర్భంగా తెలిపారు. పరిశోధన సమయంలో రీసెర్చ్ డైరెక్టర్‌గా ఎం.రవిశేఖర్ వ్యవహరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోనే పొలిటికల్ సైన్స్ విభాగంలో పిజి చేసిన సలీమ నాలుగు బంగారు పతకాలను సాధించారు. గతంలో సలీమ ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా అధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్టేట్ గర్ల్స్ కన్వీనర్‌గా, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులుగానూ పని చేశారు. పిజి అనంతరం కొంతకాలం ప్రజాశక్తిలో పనిచేశారు. ప్రస్తుతం నవ తెలంగాణ దినపత్రికలో ఫీచర్స్ డెస్క్ బాధ్యతలు చూస్తున్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. నవ తెలంగాణ సలీమకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

రైతులను ఆదుకుంటాం

- రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను అధిగమించి వ్యవసాయానికి అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, రైతులను ఆదుకుంటామని వైసిపి రైతు విభాగం అధ్యక్షులు, రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితులు గతంలో 1899, 1913లో నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. ఇలాంటి విపత్కర సమయాల్లోనూ ప్రభుత్వపరంగా రైతులకు నీటి సౌకర్యం కల్పించే విషయంలో ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భూగర్భ జలమట్టాలున్న ప్రతిచోటా రాష్ట్ర వ్యాప్తంగా 19.7 లక్షల పంపుసెట్లకు రోజుకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు సాగులో ఉన్న భూమినంతటినీ బీమా పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. ఎక్కడైతే రైతులు ఇబ్బందులు పడుతున్నారో అక్కడ సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జులై మాసంలో అధిక వర్షపాతానికి సంబంధించి కృష్ణా డెల్టాలో దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీని కూడా అందించామన్నారు. పట్టిసీమ, పులిచింతల నీళ్లు తాగు, సాగు అవసరాలకు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని తెలిపారు.

గోడ కూలి తల్లీ కుమార్తె దుర్మరణం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్
పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని నర్సిపురం కుమ్మరివీధిలో సోమవారం రాత్రి పూరింటి మట్టిగోడ కూలి మరిశర్ల సత్యవతి (45), ఆమె కుమార్తె మరిశర్ల గంగ (20) నిద్రలోనే ప్రాణాలు విడిచారు. ఈ సంఘటన రెండు రోజుల అనంతరం వెలుగులోకి వచ్చింది. అయిన వాళ్ల మధ్యనే నివాసం ఉంటున్నప్పటికీ మంగళవారం ఊరంతా దసరా సంబరాల్లో మునిగి ఉండడంతో తల్లి కుమార్తె సంచారం గురించి ఎవరూ పట్టించుకోలేదు. బుధవారం ఉదయం స్థానికులు వారి ఇంటి తలుపులు తీసి చూడగా శిథిలాల కింద ప్రాణాలు కోల్పోయిన తల్లి కూతుళ్ల శవాలను గమనించారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరి జీవితాలు ఇలా విషాదంగా ముగియడంతో బంధువులు రోదిస్తున్నారు.
సత్యవతి భర్త గౌరీ నాయుడు కొన్నేళ్ల క్రితమే మరణించారు. దీంతో కూలి పనులు చేసుకుంటూ కుమార్తె గంగను, వృద్ధురాలైన అత్తను పోషిస్తూ జీవనం కొనసాగించారు. పూరింటిలో జీవనం సాగిస్తున్న ఆమెకు గ్రామ సమీపంలోనే జగనన్న ఇల్లు మంజూరైంది. కాయ కష్టంతో ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేసుకున్నారు. కుమార్తెకు సంబంధం కుదరడంతో కొత్త ఇంటిలో పెళ్లి చేయాలనే ఆలోచనలో ఉన్న వారి జీవితాలు ఆకస్మికంగా ముగిశాయి. విఆర్‌ఓ ఫిర్యాదుపై తహశీల్దారు శివన్నారాయణ, రూరల్ ఎస్ఐ సింహాచలం మృతదేహాలను బయటకు తీయించి పంచనామా జరిపించారు.

బిజెపి చేతిలో కీలుబొమ్మలు కావద్దు

- వైసిపి, టిడిపి, జనసేనలకు సిపిఎం హితవు
- 'ప్రజారక్షణ భేరి' బహిరంగ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ
రాష్ట్రానికి అన్ని రకాలుగా ద్రోహం చేస్తూ, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వంతో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఎందుకు అంటకాగుతున్నాయో రాష్ట్ర ప్రజలకు వివరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తోలుబొమ్మలాట రాజకీయాలు చేయొద్దని, బిజెపి చేతిలో కీలుబొమ్మలుగా మారొద్దని ఆ పార్టీలకు హితవు పలికారు. అసమానతలులేని అభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలను రాష్ట్ర ప్రజలకు వివరించేందుకు సిపిఎం ఆధ్వర్యాన నవంబరు 15న విజయవాడలో నిర్వహించే "ప్రజారక్షణ భేరి" బహిరంగ సభ డోర్ పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ముందుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, డి.రమాదేవి, సిహెచ్.బాబూరావు, బి.తులసీదాస్‌తో కలిసి ఆయన బహిరంగ సభ జరిగే అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియాన్ని పరిశీలించారు. స్టేడియం ప్రాంగణంతోపాటు బిఆర్‌టిఎస్ రోడ్డు నుంచి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించే రోడ్డు మ్యాప్‌నూ పరిశీలించారు.


ఎంబి స్టేడియంలో డోర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం పట్ల అధికార వైసిపితోపాటు టిడిపి, జనసేన పార్టీలు మెతకవైఖరి అవలంభిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల హక్కులను మోడీ ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నాయన్నారు. టిడిపి, జనసేన పార్టీలు ఏ ప్రాతిపదిక ఎన్‌డిఎలో కొనసాగుతున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మద్యం ఉత్పత్తిదారుల జాబితాను బయటపెట్టాలని ఇటీవల బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి డిమాండ్ చేశారని, ఇదే అంశంపై కేంద్రానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఆ తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రికి రాష్ట్ర అప్పులు, ఆర్థిక పరిస్థితిపై ఫిర్యాదు చేసినా స్పందనలేదన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి
నవంబరు 15న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు బిఆర్‌టిఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుంచి మహాప్రదర్శన ప్రారంభమై సింగ్‌నగర్‌లోని ఎంజి స్టేడియం వరకు సాగుతుందన్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు బస్సు జాతాలు పర్యటిస్తాయని, ఈ నెల 30న కర్నూలు జిల్లా ఆదోని, పార్వతీపురం జిల్లా సీతంపేట నుంచి రెండు జాతాలు, నవంబరు 2న శ్రీకాకుళం జిల్లా మందసం నుంచి మరో జాతా ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు కె దుర్గారావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసన్న, ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలపై దాడి ఘటనలో నిందితుడికి బెయిల్

- ఎస్ఐను విఆర్‌కు పంపుతూ ఎస్‌పి ఉత్తర్వులు

ప్రజాశక్తి-మోపిదేవి (కృష్ణా)
కూలి పని కోసం వెళ్లిన గిరిజన మహిళలపై దొంగతనం కేసు మోపి నేరం అంగీకరించాలంటూ నిర్బంధించి చితకబాదిన ఘటనలో బాధితులకు న్యాయం జరిగేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. మహిళలపై దాడి ఘటనలో కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ కొత్తపాలెం గ్రామ వైసిపి కన్వీనర్ మత్తి రాజాచంద్‌ను పోలీసులు అవనిగడ్డ కోర్టులో హాజరుపర్చగా బుధవారం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. మరోవైపు మహిళలపై దాడి ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ పద్మను విఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్‌పి జాషువా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో మూడు రోజులపాటు నిర్బంధంలో ఉండి చావు దెబ్బలు తిన్న గిరిజన మహిళలు ఆస్పత్రి నుంచి ఇంకా డిశ్చార్జ్ కాకుండానే నిందితుడు బెయిల్‌పై బయటకు రావడం పట్ల ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ వారికి ఒక న్యాయం, పీడిత వర్గాలకు మరో న్యాయం అన్నట్టుగా వైసిపి పాలన నడుస్తోందని తెలిపారు.

కరువుపై రాష్ట్ర ప్రభుత్వానిది బాధ్యతారాహిత్యం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
వర్షాభావ పరిస్థితులతో కరువు తాండవిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం కరువు మండలాలను ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలోని దాసరిభవన్‌లో ఆయన పార్టీ రాష్ట్ర నాయకులు జెవి సత్యనారాయణ, జెవివి ప్రసాద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 679 మండలాల్లో 300కుపైగా మండలాల్లో తీవ్ర వర్షాభావంతో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా నీళ్లు అందించే అవకాశం వున్నా.. ప్రభుత్వ అసమర్థత కారణంగా కృష్ణా డెల్టా కింద ఆయకట్టు ఎండిపోతోందన్నారు. రాష్ట్రంలో కరువు సమస్యపై అన్ని రాజకీయ పార్టీలనూ, రైతు సంఘాలనూ, ప్రజా సంఘాలనూ కలుపుకుని ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. అధికార పార్టీ నాయకులు పుంగనూరులో టిడిపి కార్యకర్తలను అడ్డుకుని, చొక్కా విప్పించి దౌర్జన్యానికి పాల్పడటాన్ని అందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు.
కేంద్రానికి తెలియకుండా రాష్ట్రం అప్పులు చేస్తోందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రూ.వేలకోట్ల లిక్కర్ స్కామ్ జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్, ఆర్థిక అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని కోరితే కేంద్రం ఏమి సమాధానం చెప్పిందో ప్రజలకు పురందేశ్వరి వివరించాలని డిమాండ్ చేశారు. బిజెపి, వైసిపి రాష్ట్రంలో డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు.

పెత్తందారుల కోటను బద్దలు కొట్టబోతున్నాం

- వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా పెత్తందారుల కోటను బద్దలు కొట్టబోతున్నామని మంత్రులు జోగి రమేష్, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించిన పోస్టరును బుధవారం వారు ఆవిష్కరించారు. అనంతరం జెండా ఊపి బస్సు యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమలలో సామాజిక సాధికార బస్సు యాత్ర మొదలవుతుందన్నారు. ఎన్‌టిఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పటి నుంచి చేసిన పాపాలకు పరిహారం చేసేలా టిడిపి యాత్ర చేయాలన్నారు. చంద్రబాబు నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో చేసిన అక్రమాల గురించి భువనేశ్వరి ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్, ఎస్‌టి సెల్ అధ్యక్షులు హనుమంత్ నాయక్ మాట్లాడారు.

మత్స్యకారుల జీవితాలతో చెలగాటం

- బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుతో పెరగనున్న కాలుష్యం
- ఆందోళనలో అనకాపల్లి జిల్లా తీర ప్రాంతవాసులు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి
అనకాపల్లి జిల్లాలోని సముద్రతీరం రసాయన పరిశ్రమల కేంద్రంగా మారనుంది. ఇప్పటికే నక్కపల్లి హెటిరో డ్రగ్స్, పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్‌లోని పలు పరిశ్రమల కాలుష్యంతో మత్స్యకారుల జీవనోపాధికి దెబ్బతగిలింది. ఈ నష్టం చాలదన్నట్లు కాకినాడ సెజ్ నుంచి బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లికి తరలించాలని సెప్టెంబర్ 20న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇది అమల్లోకి వస్తే సముద్రంలో చేపలు వేటాడే మత్స్యకారులు, ఆ వేట ఆధారంగా బతుకుతున్న ఇతర వృత్తిదారుల బతుకులపై తీవ్ర ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో 73 కిలోమీటర్ల తీర ప్రాంతంలోని పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో దాదాపు 20 వేల మత్స్యకారులకు ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును ప్రధానంగా మత్స్యకారులు, ఆ ప్రాంత ప్రజలు వ్యతిరేకించకుండా కొత్త ఎత్తులు ప్రారంభమయ్యాయి. అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద రూ.389 కోట్ల వ్యయంతో ఫిషింగ్ హార్బర్, నక్కపల్లి మండలం రాజయ్యపేట, దొండవాక తీరం వద్ద రూ.25 కోట్ల చొప్పున ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. రసాయన, ఔషధ పరిశ్రమల


నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ప్రతిపాదిత స్థలం

కాలుష్యంతో సముద్రంలో చేపల వేట గణనీయంగా తగ్గి, జీవనోపాధి పోయిందని నక్కపల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం మండలాల్లోని మత్స్యకారులు ఆందోళనల బాట పట్టినా ప్రభుత్వం చెవికెక్కించుకోవడం లేదు. ఈ కాలుష్య నష్టం సరిపోదన్నట్లు కాకినాడ సెజ్‌లో మత్స్యకారులు, ప్రజలు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లికి తరలించే ప్రయత్నం చేస్తోంది.

ప్రభుత్వ ఆలోచన ఇలా...
బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ముందే ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటి నిర్మాణాలను చూపి మత్స్యకారుల నుంచి వచ్చే వ్యతిరేకతను తగ్గించుకొని బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు పనులను ముమ్మరం చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. మత్స్యకారుల బతుకులను ప్రభుత్వం ఏ మాత్రమూ పరిగణనలోకి తీసుకోకుండా కింద ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను చూపి, పైన రసాయన, ఔషధ పరిశ్రమలకు అనుమతులివ్వనుంది. హెటిరో పరిశ్రమతో రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం, డిఎల్.పురం, బంగారయ్యపేట గ్రామాల మత్స్యకారులు, కంపెనీకి ఆనుకొని ఉన్న అయ్యన్నపాలెం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట, ఎన్.నర్సాపురం, చందనాడ, జానకయ్యపేట, సిహెచ్‌ఎల్ పురం ప్రజలు నిరంతరం కాలుష్య ప్రభావానికి గురవుతున్నారు. అయినా, కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదు. విశాఖ-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటులో ఎపిఐఐసి సేకరించిన 4,500 ఎకరాలు భూమిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది.

తాజాగా ఏం జరుగుతోంది?
పూడిమడక వద్ద 37 ఎకరాల విస్తీర్ణంలో రూ.389 కోట్లతో నిర్మించే ఫిషింగ్ హార్బర్‌కు టెండర్లు ప్రక్రియ పూర్తయింది. నిర్మాణ పనులకు సామగ్రి తరలింపు, భవిష్యత్తులో వాహన రాకపోకలకు సమస్యలు తలెత్తకుండా శాశ్వత వెడల్పు రహదారికి అవసరమైన భూమిని సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. హార్బర్ పనులు పూర్తయితే వెయ్యి వరకు మెకనైజ్డ్ బోట్లు పెట్టుకొనే అవకాశముంది. రాజయ్యపేట ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు కనీస అవసరమైన మూడెకరాల భూమిని మార్కెట్ రేటు చెల్లించి ఎపిఐఐసి నుంచి తీసుకోవాలని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దొండవాక వద్ద భూమి లేకపోవడంతో భూమికి భూమి ఇచ్చి రైతుల నుంచి మూడెకరాలు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. భూమి సమస్య పరిష్కారం అయిన వెంటనే నిర్మాణ పనుల టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. ఆ తరువాత బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు సంబంధించి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టనుంది.

డిసెంబరు నాటికి స్టేట్ విజన్ ప్లాన్-2047

- నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి రాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
వికసిత్ భారత్-2047లో భాగంగా నీతి ఆయోగ్ సహకారంతో స్టేట్ విజన్ ప్లాన్-2047ను డిసెంబరు నాటికి సిద్ధం చేసేందుకు రాష్ట్ర ఉన్నత అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రణాళికశాఖ ఆధ్వర్యాన మూడు రోజులపాటు జరగనున్న వర్క్‌షాపు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం ప్రారంభమైంది. నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి రాధ అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అందజేసి, వారికి సాధికారత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్-2047 చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర అధికారులు సమగ్రమైన స్టేట్ విజన్ ప్లాన్-2047ను సాధ్యమైనంత త్వరగా రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రణాళికశాఖ కార్యదర్శి ఎం గిరిజాశంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రాథమిక రంగానికి సంబంధించి వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్, ఉద్యానవనం, సెరీకల్చర్, మార్కెటింగ్ శాఖల అభివృద్ధిపై వ్యూహాత్మక వృద్ధి సాధించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు వర్క్‌షాపులో భాగంగా ఉదయం సామాజిక రంగానికి సంబంధించిన వైద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు, వికలాంగులు, వృద్ధులు, సంక్షేమం, పౌర సరఫరాలశాఖతో పాటు వ్యవసాయ అనుబంధ 12 శాఖలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ కమిషనరు జె నివాస్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, ఆరోగ్యశ్రీ ట్రస్టు సిఇఒ హరీందర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

29న పాక్షిక చంద్రగ్రహణం

- తిరుమల శ్రీవారి ఆలయం మూత

ప్రజాశక్తి -తిరుమల
అక్టోబర్ 29న తెల్లవారుజామున 1:05 నుంచి 2:22 గంటల మధ్య పాక్షిక చంద్రగ్రహణం కారణంగా అక్టోబర్ 28 రాత్రి 7.05 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నట్లు టిటిడి అధికారులు పేర్కొన్నారు. తిరిగి 29 తెల్లవారుజామున 3:15 గంటలకు ఏకాంత శుద్ధి, సుప్రభాత సేవ నిర్వహించి ఆలయ తలుపులు తెరవనున్నారు. చంద్రగ్రహణం కారణంగా ఎనిమిది గంటల పాటు ఆలయ తలుపులు మూసి ఉంటాయి. ఈ కారణంగా సహస్ర దీపాలంకార సేవ, వికలాంగులు, వయోవృద్ధుల దర్శనాన్ని 28న రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

దేవరగట్టు ఉత్సవంలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

నిద్రపట్టి, విరుపాపురం తదితర గ్రామాలవారు ప్రయత్నించారు. రింగ్ కర్రలు, అగ్ని దివిటీలతో ఈ ఉత్సవానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఆలూరు మండలం ములగవెల్లి కొట్టాలకు చెందిన రామాంజనేయులు (42), బళ్లారికి చెందిన ప్రకాష్ (28) మృతి చెందారు. చెట్టు ఎక్కి కొమ్మపై కూర్చొని ఈ ఉత్సవాన్ని తిలకిస్తున్న ఆస్పరికి చెందిన గణేష్ (17) ఆ కొమ్మ విరిగిపోవడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయారు. ఉత్సవ మూర్తులను దక్కించుకోవడానికి రింగ్ కర్రలతో కొట్టుకోవడం, అగ్ని దివిటీల వల్ల 105 మందికి గాయాలయ్యాయి. జైత్రయాత్ర ఆగకుండా గొరవయ్య తన తొడ పిక్కల నుంచి రక్తాన్ని చిందించాడు. అక్కడి నుంచి ఎదురు బసవన్న గుడి వద్దకు చేరుకుని భవిష్య వాణి వినిపించారు. ఆ తర్వాత సింహాసన కట్టకు వెళ్తుండగా భక్తులు పోటీపడి కర్రలతో మరోసారి తలపడ్డారు. శ్రీమాల మల్లేశ్వర విగ్రహ మూర్తులు సింహాసన కట్టకు చేరడంతో ఉత్సవం ముగిసింది.

భారీగా బందోబస్తు
ఒక అడిషనల్ ఎస్‌పి, తొమ్మిది డిఎస్‌పిలు, 66 మంది సిఐలు, వెయ్యి మంది పోలీసులు, 48 స్పెషల్ పార్టీ బృందాలు, రెండు ఎపిఎస్‌పి బలగాలు, 185 మంది హోంగార్డులతో బందోబస్తు నిర్వహించినా ఉత్సవంలో ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌పి జి.కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, హోళగుంద తహశీల్దార్ హుస్సేన్ సాబ్, పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మీడియాపై పోలీసుల ఆంక్షలు
దేవరగట్టులో స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక వైద్యశాలలో గాయాలైన భక్తుల ఫొటోలు, వీడియో కవరేజీ కోసం వెళ్లిన మీడియాపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు 'ఏ మీడియా కూడా లోపలికి వెళ్లకూడదు' అంటూ దురుసుగా ప్రవర్తించారు. ఇలాంటి ఆంక్షలు విధించడం మీడియాకు సంకెళ్లు వేసినట్లు అవుతుందని విలేకరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రలు దేనికి? : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సామాజిక సాధికార బస్సు యాత్రలను జగన్ ప్రభుత్వం ఎందుకు చేస్తుందో అర్థం కావడం లేదని, దీనివల్ల ఉపయోగం ఏమిటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు ప్రశ్నించారు. సామాజిక సాధికారత సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ పోలేదని, ఏ ఒక్క పథకమూ అమలు చేయలేదని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఎస్‌సి, ఎస్‌టిల కోసం అనేక పథకాలు ఉండేవని, వైసిపి ప్రభుత్వం వాటిని పూర్తిగా తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌ను కులాలవారీగా జగన్ వేరు చేశారని విమర్శించారు. జగన్ పాలనలో దళిత మంత్రులు, 27 మంది దళిత ఎమ్మెల్యేలు ఉన్నా, దళితుల బాగు కోసం ఏ విధంగానూ సహకరించడం లేదన్నారు.

దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొనేందుకు చర్యలు

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో 323 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్‌లో పంటలు సాధారణ సాగు కాలేదని తెలిపారు. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 28 లక్షల ఎకరాల్లో పంటలు వేయలేదన్నారు. అక్టోబరు నెల పూర్తి కావస్తున్నా 440 మండలాల్లో వర్షం పడకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. రబీ పంటలు వేయడానికి కూడా పరిస్థితులు అనుకూలంగా లేవని, డెల్టా ప్రాంతంలో సైతం తగినంత నీరు సరఫరా కాకపోవడంతో కాలువ చివరి భూముల కింద పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. పంటలను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి పోసినా, వాగులు, చెరువులు, మురుగు కాలువల నుంచి ఆయిల్ ఇంజిన్లతో కిలోమీటర్ల దూరం పైపులతో నీరు తోడిపోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు అందించేందుకు ఎకరాకు రూ.30 వేలు రైతులు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్న పంటలను కాపాడటానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో కోత లేకుండా తొమ్మిది గంటలు అందించాలని, ఖరీఫ్ పంటలు వేయలేకపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్షాభావం, కరువు కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని వారు కోరారు. అన్ని పంటలకూ సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రైతు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని కోరారు.

కాంగ్రెస్‌లోకి రాజగోపాల్‌రెడ్డి

- 27న రాహుల్‌గాంధీ సమక్షంలో చేరిక
- బిజెపికి రాజీనామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణలో బిజెపికి షాక్ తగిలింది. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్రంలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉంది. ప్రజలు మార్పును కోరుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. కెసిఆర్ కుటుంబ పాలన నుంచి తెలంగాణను విముక్తి చేయాలి. నా ఆశయం ఐదు వారాల్లో నెరవేరుతుందని భావిస్తున్నాను. బిఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలు కాంగ్రెస్‌ను భావిస్తున్నారు. నేను ఏనాడూ పదవుల కోసం ఆరాటపడలేదు. తెలంగాణ ప్రయోజనాల కోసమే తపన పడ్డాను. ఈనెల 27న రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. 100 మంది బిఆర్‌ఎస్ నేతలు ఎంతో కష్టపడితే మునుగోడు ఉప ఎన్నికలో ఆ పార్టీ గెలిచింది. ప్రస్తుతం బిజెపి నాయకత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాల కారణంగా ప్రజల్లో నమ్మకం పోయింది. బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటేనని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఎల్బీనగర్ లేదా మునుగోడు టికెట్ ఇచ్చేందుకు బిజెపి సిద్ధపడింది. కానీ, ప్రజల అభీష్టం మేరకు కాంగ్రెస్‌లో చేరుతున్నా. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో ఉంటేనే మీరు గెలుస్తారని ప్రజలు నాతో చెప్పారు. మళ్లీ మునుగోడు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తా' అని వెల్లడించారు.

మంగళగిరికి పాఠశాల విద్యాశాఖ కార్యాలయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : పాఠశాల విద్యాశాఖ కార్యాలయం గుంటూరు జిల్లా మంగళగిరి వద్దకు రానుంది. రాష్ట్ర విభజన తరువాత హైదరాబాద్ నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఇబ్రహీంపట్నంలోని ఆంజనేయ టవర్స్‌లో ప్రస్తుతం ఈ కార్యాలయం తన విధులను నిర్వహిస్తోంది. ఇబ్రహీంపట్నం నుంచి మంగళగిరిలో ఉన్న వెంకట్రాది టవర్స్‌కు తరలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జిఒ విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఈ మేరకు జిఒ 266ను విడుదల చేశారు. పాఠశాల విద్యాశాఖతో పాటు ఆంజనేయ టవర్స్‌లోనే ఉన్న ఎపి మోడల్ స్కూల్ సొసైటీ, వయోజన విద్య, విజయవాడలోని కృష్ణలంకలో ఉన్న జవహర్ బాల భవన్, గుంటూరులో ఉన్న ఎపిఆర్ఇఐ సొసైటీ, మంగళగిరిలోనే ఉన్న గ్రంథాలయ సంస్థ కార్యాలయాలు వెంకట్రాది టవర్స్‌కు తరలి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. 40 వేల చదరపు అడుగులను ఒక్కో చదరపు అడుగుకు రూ.20, అదనపు సౌకర్యాలు కోసం అదనంగా మరో రూ.5గా పేర్కొంది. మొత్తంగా చదరపు అడుగుకు రూ.25 అద్దెగా ప్రభుత్వం వెల్లడించింది.

ప్రాణనష్టం ఆందోళనకరం : యుఎన్‌ఎస్‌సిలో భారత్

జెనీవా : ఇజ్రాయిల్ - హమాస్ వివాదంతో పశ్చిమాసియాలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితి మరియు పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రాణ నష్టంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. శాంతి స్థాపనకు అవసరమైన పరిస్థితులను సృష్టించేందుకు, హింసను ఆపి ప్రత్యక్ష చర్చలను పునః ప్రారంభించేందుకు ఇరుదేశాలు పక్షాలు ముందుకు రావాలని పిలుపునిచ్చింది. పశ్చిమాసియాలో పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి(యుఎన్‌ఎస్‌సి)లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఐరాసలో భారత ఉప శాశ్వత ప్రతినిధి ఆర్.రవీంద్ర చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రాణ నష్టం, క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోందని అన్నారు. పెరుగుతున్న మానవతా సంక్షోభం కూడా అంతే భయంకరంగా ఉందని అన్నారు. ఇరుపక్షాల దాడుల్లో పౌర మరణాలు ఆందోళనకరమని అన్నారు. ఇరు పక్షాలు పౌరులకు ముఖ్యంగా మహిళలు మరియు చిన్నారులకు రక్షణ కల్పించాలని అన్నారు. గాజాలో మానవతా సంక్షోభానికి తెరదించాలని విజ్ఞప్తి చేశారు. శాంతికి అవసరమైన పరిస్థితులను కల్పించేందుకు మరియు తీవ్రతరం చేసేందుకు హింసను నివారించడం ద్వారా ప్రత్యక్ష చర్చలను పున: ప్రారంభించడం కోసం కృషి చేయాలని ఇరు పక్షాలను కోరారు.

'నిజం' ఎప్పటికైనా 'గెలుస్తుంది'

(మొదటిపేజీ తరువాయి)

జైలు నుంచి కడిగిన ముత్యంలా మీ ముందుకు వస్తారని, అప్పటివరకూ నాతోపాటు మీరు కూడా చేయిచేయి కలిపి పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత మాట్లాడుతూ ఒక ముఖ్యమంత్రి కూతురిగా, ఓ ముఖ్యమంత్రి భార్యగా ఎప్పుడూ బయటకు రాని భువనేశ్వరమ్మ ఈ రోజు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు మీ ముందుకు వచ్చారన్నారు. ప్రతి తెలుగు మహిళా, ప్రతి టిడిపి అభిమాని ఆమెకు వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. మాజీ స్పీకర్ ప్రతిభాభారతి మాట్లాడుతూ '2024లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు అయిన నేను ప్రమాణం చేస్తున్నా' అని చెప్పేంత వరకూ టిడిపి శ్రేణులన్నీ ఒక్కటవ్వాలన్నారు. ఎంఎల్‌సి పంచుమర్తి అనురాధ అధ్యక్షత వహించిన ఈ సభలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టిడిపి అధికార ప్రతినిధి నల్లారి నరేష్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌సిలు దొరబాబు, కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. 'నిజం గెలవాలి' అనే బ్యాక్‌డ్రాప్ బ్యానర్‌లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఫొటో కనిపించింది. అయితే, జనసేన శ్రేణులు ఎవరూ సభకు హాజరు కాలేదు. అనంతరం 'నిజం గెలవాలి' బస్సు యాత్ర తిరుపతి నియోజకవర్గంలో అడుగు పెట్టింది.

నేటి నుంచి 'ఖాదీ మహోత్సవ్'

• సమగ్ర శిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం చేపట్టనున్న 'ఖాదీ మహోత్సవ్' కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానుందని సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఖాదీ మహోత్సవ్ అంశంగా అన్ని పాఠశాలల్లో క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. క్విజ్ పోటీల్లో ఈ నెల 31 వరకు ఎవరైనా పాల్గొనవచ్చునని వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పాఠశాల స్థాయిలో శుక్రవారం, మండల స్థాయిలో శనివారం, జిల్లా స్థాయిలో ఆదివారం నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలను, భాష, కేటగిరి వారీ వివరాలను సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయానికి ఈ నెల 29లోపు పంపాలని ప్రాంతీయ, జిల్లా విద్యాశాఖ అధికారులకు, సమగ్ర శిక్ష ఎపిసిలకు ఆదేశాలు జారీ చేశారు.

ఇజ్రాయిల్‌ను సమర్థించడం దేశానికి అవమానకరం

• కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

గాజాపై దారుణానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌ను మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ సమర్థించడం భారతదేశానికి అవమానకరమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గాజాలోని ఆస్పత్రిపై ఇజ్రాయెల్ చేసిన బాంబుల దాడిలో 500 మంది రోగులు, మరో 500 మంది ఆస్పత్రి సిబ్బంది మరణించారని, వారిలో చిన్నపిల్లలు, మహిళలు అధికంగా ఉన్నారని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ చంకలో మోడీ ఉన్నందునే ఆయన చెప్పినట్లు నడుచుకుంటున్నారని విమర్శించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రధానులుగా ఉన్నప్పుడు భారతదేశం ప్రపంచంలోని అన్ని దేశాలతో మంచి సంబంధాలను కొనసాగించిందని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జిఎస్‌టి విధానాన్ని తీసుకురావడం వల్ల మూడు వేలకు పైగా వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. నెలకు రూ.లక్షన్నర కోట్లు జిఎస్‌టి ద్వారా కేంద్రం వసూలు చేస్తోందని, ఆ డబ్బు ఎక్కడికి వెళుతుందని, ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యమే లేదని విమర్శించారు.

పరిశ్రమ పెట్టండి.. లేదా భూములు వెనక్కివ్వండి

• జింక్ ఇండస్ట్రీ భూ పరిరక్షణ రైతు కమిటీ డిమాండ్

• '350 ఎకరాల స్వాహా'పై జింక్ భూ రైతులు, పారిశ్రామిక వర్గాల్లో చర్చ!



హిందుస్థాన్ జింక్ పరిశ్రమ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'350 ఎకరాల స్వాహా' పేర బుధవారం ప్రజాశక్తి దినపత్రిక ప్రధాన సంచికలో వెలువడిన కథనంపై విశాఖపట్నం పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర చర్చ రేపింది. వివిధ పరిశ్రమలకు చెందిన వారు దీనిపై పలు రకాలుగా స్పందించారు. హిందుస్తాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్‌ఎల్) స్థలసేకరణ కోసం 1971-74 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు 350 ఎకరాలను మిండి, ముక్కవానిపాలెం, ములగాడ, నక్కవానిపాలెం రైతులు కారుచౌకగా ఎకరా రూ.800కే ఇచ్చేశారు. వీరంతా ప్రస్తుత ఈ వార్తా కథనంతో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. పరిశ్రమైనా పెట్టండి... లేదంటే మా భూములైనా వెనక్కి ఇవ్వండి' అనే నినాదంతో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు జింక్ భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ పిట్టా నారాయణమూర్తి, కార్యదర్శి ఒ.వెంకటరావు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమ కోసం తామిచ్చిన భూములను రియల్ ఎస్టేట్ చేయడానికిగానీ, అదానీ పోర్టు బొగ్గు నిల్వల యార్డుకు ఇచ్చేందుకుగానీ అంగీకరించేదిలేదని రైతులు తేల్చి చెప్తున్నారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్... మిండి ప్రాంతానికి చెందిన వారేనని, త్వరలో ఆయనను కలుస్తామని నారాయణమూర్తి తెలిపారు.

178 మంది కార్మికులకు రూ.10 కోట్లు బకాయి

జింక్ భూ పరిరక్షణ కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం... 2002 సంవత్సరంలో వాజ్‌పేయి (బిజెపి) ప్రభుత్వ హయాంలో అమ్మేసిన నాటికే హిందుస్థాన్ జింక్ పరిశ్రమ మూడు స్మెల్టర్లు, ఐదు గనులు కలిగి ఉంది. 1977లో ఉత్పత్తి ప్రారంభించింది. లెడ్ ప్లాంట్‌ను మూసేయడమే కాకుండా 178 మంది కార్మికులకు సుమారు రూ.10 కోట్ల బకాయిలు యాజమాన్యం ఎగ్గొట్టింది. మొత్తంగా 265 మంది కార్మికులకు ఫైనల్ సెటిల్‌మెంట్‌ను జింక్ యాజమాన్యం చేయలేదు. వీరిలో 210 మంది కార్మికులు లేబర్ కోర్టులో కేసు వేయగా, వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. కానీ, జింక్ స్వాధీనం చేసుకున్న వేదాంత యాజమాన్యం హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుని నేటికీ కాలయాపన చేస్తోంది. భూముల స్వాహాపై ఏ స్థాయి పోరాటానికైనా వెనుకాడబోమని జింక్ భూ పరిరక్షణ కమిటీ పేర్కొంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేట్ వాళ్ల చేతుల్లో పెడితే రూ.లక్షల కోట్లు విలువైన 23 వేల ఎకరాల పరిస్థితి కూడా హిందుస్థాన్ జింక్‌లా మారిపోవడం ఖాయమని రైతులు అంటున్నారు. జింక్‌లో భూమిపోకుండా అడ్డుకుని తీరుతామని, భూ బాధిత రైతులు ఆందోళనకు సిద్ధం అవుతున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పారిశ్రామిక వర్గాలేమంటున్నాయంటే...

హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌ను స్వాధీనం చేసుకున్న వేదాంత (స్టెరిలైట్ కంపెనీ) 350 ఎకరాల ల్యాండ్ కన్వర్షన్ కింద (రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు) ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు అవుననిగానీ, కాదనిగానీ చెప్పలేదు. రెండేళ్లుగా జాప్యం చేస్తూ కిమ్మనకపోవడంపై కేంద్రంలోని బిజెపి పెద్దల సమక్షంలో రహస్య ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేదాంత... అదానీతో జత కలిసి వ్యవహారాన్ని సెటిల్ చేసినట్లు తాజాగా పలువురు పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

సాగునీటి కోసం రైతుల ధర్నా

ప్రజాశక్తి- వంగర : తోటపల్లి కుడి కాలువ ఆయకట్టుకు శివారున ఉన్న విజయనగరం జిల్లా వంగర మండలంలోని భూములకు సాగునీరు అందించాలని రైతులు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ..తోటపల్లి ప్రాజెక్టు కుడి కాలువ ఆయకట్టుకు వంగర మండలంలోని శివారు భూములకు సాగునీరు అందక ప్రతిఏడాది రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. మండలంలోని కొత్తవలస, మద్దివలస, ఎం.సీతారాంపురం, వంగర, శివ్వాం, తలగాం, చిన రాజుల గుమ్మడ తదితర గ్రామాల్లో ప్రస్తుతం వెన్ను దశలో ఉన్న వరి పంట సాగునీరు లేక ఎండిపోతోందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని సాగునీరు అందించాలని కోరారు. లేకపోతే రైతుల పక్షాన పోరాడతామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ.. పంట చివరి దశలో సాగునీరు లేక వరి పంట ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం తహశీల్దార్ డి. ఐజాక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామ్మూర్తి నాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వాషింగ్ మెషిన్లలో నగదు తరలింపు

• రూ.1.30 కోట్లు సీజ్ చేసిన పోలీసులు

ప్రజాశక్తి -గోపాలపట్నం (విశాఖపట్నం)

వాషింగ్ మెషిన్ల లోడు మాటున తరలిపోతున్న నగదును విశాఖ ఎయిర్‌పోర్టు పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు సిఐ బిఎండి ప్రసాదరావు కథనం ప్రకారం... ఎలక్ట్రానిక్ వస్తువుల లోడుతో ఓ ఆటో రాత్రిపూట వెళ్తోంది. ఆటో వెనుకే బైక్‌పై ఒక వ్యక్తి పైలెట్‌లా వెళ్తున్నాడు. గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానంతో ఆటోను ఆపి తనిఖీ చేశారు. ఆరు వాషింగ్ మెషిన్లు, 30 సెల్‌ఫోన్లను తరలిస్తుండడాన్ని గమనించి డ్రైవర్‌ను నిలదీశారు. విశాఖ నుంచి విజయవాడకు వాషింగ్ మెషిన్లు తరలిస్తున్నట్లు ఆటో డ్రైవర్ సమాధానమిచ్చాడు. దీంతో వాషింగ్ మెషిన్లను ఒక్కొక్కటి కిందకు దింపి తనిఖీ చేయగా వాటిల్లో రూ.1.30 కోట్ల నగదును గుర్తించారు. వెంటనే ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆరు వాషింగ్ మెషిన్లు, సెల్‌ఫోన్లు, ఆటో, బైక్‌లను సీజ్ చేశారు. 41, 102 సిఆర్‌పిసి కింద కేసు నమోదు చేశారు.

ఎలక్ట్రానిక్ షాపు నగదుగా గుర్తింపు

పట్టుబడిన నగదు ఓ ఎలక్ట్రానిక్ షాపునకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. దసరా సేల్ నగదును విజయవాడలోని బ్యాంకులో జమ చేసేందుకు తీసుకెళ్తున్నట్టు ఎలక్ట్రానిక్ షాపు యజమాని వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది.

మందకొడిగా పనులు

• పోలవరం పనుల పరిశీలనలో మంత్రి అంబటి

ప్రజాశక్తి - పోలవరం

లోయర్, అప్పర్ కాఫర్ డ్యాముల మధ్య నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య ఉన్న సీఫేజు నీటిని మళ్లించేందుకు నిర్మిస్తున్న కాలువ పనులను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా రిపేరు చేయడమా, కొత్తది నిర్మించడమా అనేది కేంద్ర జలశక్తి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, వారి నిర్ణయం అనంతరం పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. దిగువ, ఎగువ కాఫర్ డ్యాంల మధ్య డి వాటర్ వర్క్స్ జరుగుతున్నాయని, వాటర్ వర్క్స్ అనంతరం వైబ్రో కంపాక్ట్ కాంపౌండ్ మొదలవుతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో 41.15 కాంటూరు వరకు వేసిన అంచనాలకు నేటికీ ఖర్చు పెరిగిందని, దీని ప్రకారం రూ.31,625 కోట్లు సిడబ్ల్యుసి రివైజ్డ్ కాస్ట్‌కి బిల్లును పంపించామని చెప్పారు. ఈ బిల్లు కేబినెట్‌లో అంగీకరించిన తర్వాత రీయింబర్స్‌మెంట్ నగదు వస్తుందని, అయితే ప్రస్తుతం ఈ బిల్లు కేబినెట్‌లో పెండింగులో ఉందని తెలిపారు. దీన్నిబట్టి 45.72 కాంటూరు వరకు మరో రూ.16 వేల కోట్లు ఖర్చు పెట్టాలని చెప్పారు. 41.15 వరకు పూర్తయ్యాక మిగిలిన వాటి గురించి చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రం నుండి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనేకసార్లు ప్రధానమంత్రిని కలిసి కోరారన్నారు. అనంతరం పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పోలవరం చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, ఎస్ఇ సుధాకర్‌బాబు, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎస్ఇ శ్యామ్‌ప్రసాద్, ఇఇ ఏసుబాబు పాల్గొన్నారు.

వడ్డీ చెల్లించండి

• ఖర్చు చేయని నిధులపై కేంద్రం మార్గదర్శకాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర పథకాలకు ఇచ్చే నిధుల్లో ఖర్చు చేయని నిధులకు వడ్డీ చెల్లించాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. ఈ వడ్డీ చెల్లింపుల కోసం ఎస్ఓపి (స్టాండింగ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) అనుసరించాలని పేర్కొంది. కేంద్రం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కన్సాలిడేటెడ్ నిధిలో ఈ మొత్తాన్ని జమ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. మూడు రకాలుగా ఈ మొత్తాన్ని చెల్లించేందుకు మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

పిఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా నేరుగా భారత్‌కోష్ ద్వారా వడ్డీ చెల్లింపులు చేయవచ్చునని, తమ ఖాతాల ద్వారా చెక్కుల రూపంలో చెల్లించవచ్చునని, ఎడిట్ సెంటర్ ఏజెన్సీ ద్వారా చెల్లించవచ్చని పేర్కొంది.


టిటిడి పరిపాలనా భవనం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నిధులు కేటాయించే వరకూ పోరాటం

• టిటిడి పరిపాలనా భవనం వద్ద అఖిలపక్షం ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి అభివృద్ధి విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని, సమస్య పరిష్కారం అయ్యే వరకూ వివిధ రూపాల్లో పోరాడుతూనే ఉంటామని అఖిలపక్ష నేతలు ఉద్ఘాటించారు. అఖిలపక్ష పార్టీలను సిఎం వద్దకు తిరుపతి ఎమ్మెల్యే, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తీసుకెళ్లయినా సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తిరుపతి అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో బుధవారం టిటిడి పరిపాలన భవనం వద్ద జరిగిన ధర్నాలో అఖిలపక్షం నేతలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. తిరుపతి అభివృద్ధికి ఒక్కశాతం నిధులను టిటిడి పాలకమండలి కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడం సమంజసం కాదన్నారు.

తిరుపతి అభివృద్ధి వేదిక కన్వీనర్ టి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళి (సిపిఎం), పి. మురళి (సిపిఐ), ఆర్. హరికృష్ణ (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), పి.అంజయ్య (ఆర్‌పిఐ) నీరుగట్టు నగేష్, వెంకటాచలపతి (ఆమ్‌ఆద్మీ పార్టీ) డిఎంసి భాస్కర్ (కాంగ్రెస్ పార్టీ) ఆర్యాట్ కృష్ణ ప్రసాద్ (బిఆర్ఎస్) తదితరులు ప్రసంగించారు. బిజెపి, విహెచ్‌పిల ధర్నా పోస్టర్లకు భయపడి టిటిడి బోర్డు ప్రతిపాదనను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరస్కరించడాన్ని వారు తప్పుబట్టారు. తిరుపతి ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. టిటిడి లాంటి ధార్మిక సంస్థ నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలన్నారు. రూ. 4,500 కోట్ల ఆదాయం ఉన్న టిటిడికి ఒక్కశాతం నిధుల కేటాయింపు పెద్ద విషయం కాదని పేర్కొన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ లాంటి అభివృద్ధి నిరోధక సంస్థలు తిరుపతి అభివృద్ధికి గత యాభై ఏళ్లుగా అడ్డుపడుతూనే ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సాయం చేయకుండా, జిఎస్‌టి పేరుతో టిటిడి నుంచి డబ్బులు దండుకుంటూ బాధ్యతారాహిత్యంగా బిజెపి వ్యవహరిస్తోందని తెలిపారు. బిజెపి అవకాశవాదాన్ని, ద్వంద్వవైఖరిని ప్రజలు అర్థం చేసుకోవాలని, వారి మాయమాటలు, రెచ్చగొట్టే తీరును ఎప్పటికప్పుడు జాగరూకతతో గమనించాలని తిరుపతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎస్‌బిఐ కార్డ్ పండుగ ఆఫర్లు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద క్రెడిట్ కార్డుల జారీ సంస్థ ఎస్‌బిఐ కార్డ్ ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆకర్షణీయ ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. ఫెస్టివ్ సీజన్ -2023లో భాగంగా దేశంలోని 2700 నగరాల్లో దాదాపు 2200 ఆఫర్లను కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఆఫ్‌లైన్‌లోనూ 27.5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్లను పొందవచ్చని పేర్కొంది. కన్స్యూమర్ డ్యూరెబుల్స్, మొబైల్స్, ల్యాప్‌ట్యాప్స్, ఫ్యాషన్, ఫర్నీచర్, అభరణాలు తదితర కొనుగోళ్లపై ఆఫర్లను అందిపుచ్చుకోవచ్చని ఎస్‌బిఐ కార్డ్ సిఇఒ, ఎండి అభ్జిత్ చక్రవర్తి పేర్కొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ సేవల విస్తరణ

మత్స్యకారుల బోట్లకు ట్రాకింగ్ వ్యవస్థ : సిఎస్

ప్రజాశక్తి-విశాఖపట్టణం : రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ మొబైల్ సేవల విస్తరణకు చర్యలు చేపట్టామని, ఇప్పటి వరకు గుర్తించిన అన్ని ప్రాంతాల్లోనూ స్థలాలను మంజూరు చేశామని, ఇతర సాంకేతిక ప్రక్రియలకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. విశాఖపట్టణం విచ్చేసిన ఆయన బుధవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తీర ప్రాంతంలో తీసుకుంటున్న భద్రతా పరమైన అంశాలు ఈస్ట్రన్ నేవల్ కమాండ్ పరిధిలో జరిగిన ఎఫెక్స్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చాయని చీఫ్ సెక్రటరీ తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే అన్ని రకాల బోట్లకు ట్రాకింగ్ సిస్టమ్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 12 నాటికల్ మైళ్ల పరిధి దాటి మనవాళ్లు వెళ్లినా, ఇతరులు వచ్చినా ఎలాంటి భద్రతా పరమైన సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపతామని తెలిపారు.

మార్చిలోగా సెల్‌టవర్ల ఏర్పాటు పూర్తి

ఏజెన్సీ ప్రాంతాల్లో టెలికాం సర్వీసుల విస్తరణకు తీసుకుంటున్న చర్యలను ప్రధాన మంత్రి ప్రగతి సమావేశంలో భాగంగా వివరించామని జవహర్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో 2,887 ప్రాంతాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామని, వాటిలో 2,840 స్థలాలను కేటాయించామని వివరించారు. 47 ప్రాంతాల్లో పెండింగ్ ఉందని తెలిపారు. 14 చోట్ల సంబంధిత కంపెనీ వాళ్లు దరఖాస్తులు సమర్పించలేదని స్పష్టం చేశారు. 13 చోట్ల రెవెన్యూ స్థలాలు, 20 చోట్ల ఫారెస్ట్ స్థలాల విషయంలో సాంకేతిక కారణాలు నెలకొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, అదనపు డిజిపి ఆర్‌కె.మీనా, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం తయారీ కంపెనీల వెనుక వైసిపి ఎంపిలు

• బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార పార్టీ ఎంపిలే మద్యం తయారీ, సరఫరాలో ఉన్నారని, అమ్మకాల నుంచి వచ్చే సంపాదన దారి మళ్లిస్తూ వైసిపి ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎపి స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్‌లో వందకు పైగా కంపెనీలు రిజిస్టర్ అయ్యాయని, వీటిలో 16 కంపెనీల ద్వారానే 74 శాతం మద్యం సేకరణ జరుగుతోందని అన్నారు. అదాన్ డిస్టలరీస్ వెనుక వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి, ఎస్‌పివై డిస్టలరీస్ వెనుక ఎంపి మిథున్‌రెడ్డి ఉన్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. అదాన్, ఎస్‌పివై సంస్థల అడ్రస్‌లు రెండూ హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు. ప్రకాశం జిల్లాలోని పాల్ డిస్టలరీస్‌కు రూ.931.32 కోట్లు మద్యానికి ఆర్డర్ ఇచ్చారని, ఈ కంపెనీని సిఎం జగన్ అనుచరులు బెదిరించి నడుపుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.56 వేలకోట్ల మద్యంపై ఆదాయం వస్తుంటే ప్రభుత్వం రూ.20 వేలకోట్ల ఆదాయం వస్తుందని చెప్పటాన్ని ఆమె తప్పుపట్టారు.

సంపాదకీయం

మైనింగ్ మాఫియా!

నెల్లూరు జిల్లాలో వెలుగు చూసిన మైనింగ్ కుంభకోణం కలకలం రేపుతోంది. వేల కోట్ల రూపాయల విలువ చేసే తెల్లరాయిని నిబంధనలకు విరుద్ధంగా విదేశాలకు తరలిస్తున్న వ్యవహారం ఇక్కడ ఏళ్ల తరబడి సాగుతున్నా, అధికార యంత్రాంగంలో నామమాత్రపు చలనం కూడా లేకపోవడం దిగ్భ్రాంతికరం. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నేతల కుమ్మక్కుతో ఏళ్ళ తరబడి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారం ఇప్పుడు బట్టబయలు కావడంతో పరస్పరం ఆరోపణలకు దిగుతున్నారు. అక్రమ మైనింగ్‌కు కారణం మీరంటే, మీరంటూ విమర్శలు గుప్పించుకోవడం విస్మయం కలిగిస్తోంది. నెల్లూరు జిల్లాలోనే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుత ప్రభుత్వ హయంలోనే కాదు, గత ప్రభుత్వ కాలంలోనూ వనరుల దోపిడి ఇదే మాదిరి కొనసాగింది. అధికారంలో ఎవరున్నా మైనింగ్ మాఫియా రాష్ట్రంలో చక్రం తిప్పుతోంది. ప్రధాన పార్టీల్లోని పెద్ద నాయకుల నుండి చోటామోటా నాయకుల వరకు ఈ వ్యవహారంలో భాగస్వాములవుతున్నారు. ఓబుళాపురం గనుల వ్యవహారం నుండి, గత, ప్రస్తుత ప్రభుత్వ హయంలో కొనసాగుతున్న ఇసుక అక్రమాల వరకూ వీటికి ఉదాహరణలే! నిధుల కొరత రాష్ట్రాన్ని వెంటాడుతున్నా, అక్రమ మైనింగ్ వ్యవహారానికి అడ్డుకట్ట వేస్తే రాష్ట్ర ఖజానా పరిస్థితి మెరుగయ్యే అవకాశం ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడానికి అక్రమార్కుల్లో అధికశాతం మంది అస్మదీయులు కావడం, ఎన్నికల అవసరాలు ముడిపడి ఉండటమే కారణం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్నో విలువైన ఖనిజాలకు నిలయం. సమైక్య రాష్ట్ర విభజన తరువాత కూడా ఈ ప్రత్యేకతను ఆంధ్రప్రదేశ్ నిలుపుకుంది. వినియోగ విలువ గల ఖనిజం ఏదో ఒకటి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ లభిస్తోంది. 2020వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాతీయ ఖనిజ వనరుల నివేదిక (నేషనల్ మినరల్ ఇన్వెంటరీ) ప్రకారం రాష్ట్రంలో 48 రకాల ఖనిజాలు లభిస్తున్నాయి. అత్యంత విలువైన బంగారం, వజ్రాలు, బాక్సైట్, బీచ్‌శాండ్, పెట్రోలియం, సహజ వాయువు నుండి అత్యంత అరుదైన యురేనియం వరకు వివిధ రకాల ఖనిజాలు వీటిలో ఉన్నాయి. బాక్సైట్, బెరైటీస్, బీచ్‌శాండ్ నుండి లభించే హెవీ మినరల్స్. లైమ్ స్టోన్ వంటి ఖనిజాలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా లభిస్తున్నాయి. వీటిని సక్రమంగా వినియోగిస్తే రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయి. కానీ, జరుగుతున్నది వేరు! కేంద్ర ప్రభుత్వ గనుల శాఖకు చెందిన 'ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్' విడుదల చేసిన 'ఇండియన్ మినరల్స్ ఇయర్ బుక్-2020'లో జిల్లాల వారీగా రాష్ట్రంలో లభించే ఖనిజాలు, వాటి వెలికితీతకు ఉన్న అవకాశాలను సవివరంగా తెలిపారు. ఈ దిశలో అధికారికంగా ప్రయత్నాలు దాదాపు శూన్యమే! ఆ గణాంకాల ప్రకారం 2017-18లో రాష్ట్రంలో మొత్తంమీద 135 గనులు (ఆటమిక్ మినరల్స్‌ను మినహాయించి) ఉండగా, 2018-19లో 133కు, 2019-20లో 123కు తగ్గాయి. వీటిలో కూడా అధికభాగం నిబంధనలు పాటించడం లేదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నోటీసులు ఇచ్చింది. ఉత్పత్తి విలువ కూడా సుమారుగా 17 వేల కోట్ల రూపాయల నుండి 14 వేల కోట్లకు పడిపోయింది. సిమెంటు పరిశ్రమలు మినహా మిగిలిన రంగాల్లో ఖనిజాధారిత పరిశ్రమలు కూడా పెద్దగా ఏర్పాటు కాలేదని నివేదిక పేర్కొంది. 2019-20 తరువాత రాష్ట్రంలో కొత్త గనులు ఏర్పడలేదు కాని, అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా పెరిగాయి.


అమెరికా, చైనా వంటి దేశాల్లో విస్తారంగా సహజ వనరులు ఉన్నప్పటికీ, వాటిని వెలికితీయడానికి బదులుగా విదేశాల నుండి దిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. భావి తరాలకు సహజ వనరులను అందచేయడం, భవిష్యత్తులో తమపై ఇతర దేశాలు ఆధారపడేలా చేసుకోవాలనే వ్యూహం దీని వెనుక ఉంది. మన దేశంలో దీనికి భిన్నం. ఖనిజాల తవ్వకాల వల్ల దేశ, విదేశీ కార్పొరేట్లు లబ్ధి పొందుతున్నారు. కార్పొరేట్ బేహారులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు కూటమిగా ఏర్పడి ప్రజల సొత్తును కొల్లగొడుతున్నారు. మన రాష్ట్రంలో ఈ దోపిడి మరింత పక్కాగా అమలు జరుగుతోంది. దీనిని అడ్డుకోవాలి. సహజ వనరులన్నీ ప్రజల సంపదే! వాటి ఫలాలు కూడా ప్రజలకే అందాలి. మైనింగ్ మాఫియాను అణచివేయాలి. నిబంధనలను ఉల్లంఘించి, చట్టవిరుద్ధంగా జరుగుతున్న గనుల తవ్వకాన్ని, ఖనిజాల రవాణాను తక్షణమే నిలిపివేయాలి. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

మహనీయుల మాట



మన దేశంలో
రెండు మహా పాతకాలున్నాయి.
ఒకటి స్త్రీలను అణగదొక్కడం,
రెండవది కుల నిబంధనలతో
పేదవారిని రాచి రంపాన పెట్టడం.


- వివేకానంద



'న్యూస్ క్లిక్'పై దాడి అందరి స్వేచ్ఛకు ప్రమాదం

విశ్లేషణ

'న్యూస్ క్లిక్' కార్యాలయంపైనా, దాదాపు దాంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి నివాసాలపైనా ఢిల్లీ పోలీసుల దుర్మార్గంగా ఇష్టానుసారం దాడులు చేశారు. జర్నలిస్టులు, ఇతర ఉద్యోగులు ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలను విచక్షణారహితంగా కనీస నిబంధనలకు పాటించకుండా తీసుకెళ్లిపోయారు. ఆ న్యూస్ పోర్టల్ ప్రధాన కార్యాలయంలో సోదాలు జరిపారు. అందులోని డేటా వివరాలకు సంబంధించి ఎలాంటి రశీదులు ఇవ్వలేదు. 'న్యూస్ క్లిక్' సంస్థాపక సంపాదకుడు, ప్రబీర్ పుర్కాయస్థ, దాని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అమిత్ చక్రవర్తి తీవ్రవాద చర్యలకు పాల్పడ్డారంటూ ఆరెస్టు చేశారు. ఇది చాలదన్నట్టు, సిబిఐ కొత్తగా ఒక క్రిమినల్ కేసును దాఖలు చేసి 'న్యూస్ క్లిక్' ఆవరణలోనూ, దాని సంస్థాపక సంపాదకుని ఇంట్లో కొత్తగా సోదాలు చేసింది. నిజానికి ఆ మధ్య స్థాయి న్యూస్ పోర్టల్ సంస్థపై ఇది ఐదోసారి దాడి. ఇలాంటి చర్యలు, 1975-77 మధ్య ఎమర్జెన్సీ నాటి నుండి భారతదేశ మీడియా స్వేచ్ఛపై ఇంత దారుణ దాడి ఎప్పుడూ లేదు. 'రిపోర్టర్స్ సాన్స్ ఫ్రంటియర్స్' ప్రచురించిన వివరాల ప్రకారం చూస్తే 2014 నుంచి జరుగుతున్న పరిణామాలతో 'భారతీయ మీడియా స్వేచ్ఛ-2023'లో మొత్తం 180 దేశాల్లో 161వ స్థానానికి దిగజారింది. వివిధ స్థాయిల్లో వృత్తిపరంగా, చట్టపరంగా, రాజకీయపరంగా గట్టి ప్రతిఘటనలు లేకుంటే ఇది ఇంకా క్షీణిస్తుంది.



ఎన్. రామ్

ఈ నేపథ్యంలో పుర్కాయస్థ, ఇతరులపై ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పరిశీలించడం చాలా అవసర మవుతుంది. బుద్ధిహీనమైన పోలీస్ రాజ్యం ఎలా ఉంటుందో అర్థం చేసుకునేందుకు వీలు కల్పిస్తుంది. ఒకవేళ కోర్టులు యథేచ్ఛగా అనుమతిస్తే "ముందు శిక్ష, తరువాతనే తీర్పు" అమలు చేయాలనుకుంటుంది. గోప్యతా కారణాల వల్ల ఎఫ్ఐఆర్ బయట పెట్టలేకపోతున్నామని పోలీసుల అంటున్నప్పటికీ ఎఫ్ఐఆర్ కొంతమంది ప్రత్యేక అవకాశాలులన్న జర్నలిస్టుల చేతుల్లోకి వెళ్ళింది. దాన్ని ఏమాత్రం చూసినా ఇదంతా ఒక కుట్రపూరితమైన కుహనా వ్యవహారమనీ నకిలీ కేసు అని తెలిసిపోతుంది. 'న్యూస్ క్లిక్'పై చేసిన ఆరోపణలు ఏ మాత్రం నిలిచేవి కాదు, అవి బూటకమైనవని "హిందూ" సంపాదకీయం స్పష్టం చేసింది. కానీ 'న్యూస్ క్లిక్' పై దాడి కేవలం పోలీసులు చేసిన హడావుడి కాదు, ఇదొక రాజకీయ వ్యవహారం. స్వతంత్రంగా, విమర్శనాత్మకంగా వ్యవహరించే వామపక్ష భావజాలం గల ప్రగతిశీల, డిజిటల్ వార్తా సంస్థపై బిజెపి, హిందూత్వ నిరంకుశ రాజ్యం చేస్తున్న యుద్ధం ఇది.

న్యూస్ క్లిక్ వాస్తవాలు

న్యూస్ క్లిక్.ఇన్ అనే సంస్థను పీపీకే 'న్యూస్ క్లిక్' స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంలో 2009లో స్థాపించారు. చాలా పరిమితమైన బడ్జెట్ తోనే అది పని చేస్తుంది. రోజువారీ పనులను ఒక సంపాదక వర్గం నిర్వహిస్తుంది. దీని వ్యవస్థాపక ప్రధాన సంపాదకుడైన ప్రబీర్ పుర్కాయస్థ ఇంజినీర్. విద్యుత్, టెలికాం, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేసే సైన్స్ కార్యకర్త. దేశంలో వామపక్షంలోని ఒక ప్రభావశీల మేథావి. ఈ నెట్‌వర్క్ ప్రజా ఉద్యమాలు, పోరాటాలను నివేదిస్తోంది. వ్యాఖ్యానాలు విశ్లేషణలూ చేస్తుంది. ఇది క్రమం తప్పకుండా విభిన్న సమస్యలపై నిరంతరం విమర్శనాత్మకమైన ప్రగతిశీల వాణి వినిపిస్తుంది. సహజంగానే ఇందులో భాగంగా 'న్యూస్ క్లిక్' మోడీ ప్రభుత్వ నిరంకుశ "హిందూత్వ", హిందూ-నిరంకుశ రాజకీయ ఎజెండాకు, దాని విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. దాని నివేదికలు, విశ్లేషణలు, రోజువారీ తాజా సమాచారం అంతా ఉచితంగానే అందిస్తుంది. వ్యాపారం, చందాలు, విదేశాలకు మీడియా కంటెంటు అమ్మకం అనే వ్యాపార నమూనాలోనే పని చేస్తుంది. రోజువారీ నిర్వహణకు, విస్తరణకు కొన్ని పెట్టుబడులను తెచ్చుకుంటుంది.

మూడు నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020-21లో రైతులు సామూహిక నిరసన కార్యక్రమాలు చేపట్టిన సమయంలో 'న్యూస్ క్లిక్' కీలక పాత్ర నిర్వహించింది. రైతాంగ ఉద్యమం విజయానికి, ఆ ప్రజా వ్యతిరేక చట్టాల రద్దుకు ఈ కృషి దోహదపడిందనే భావం అందరిలో ఏర్పడింది.

ఇక్కడే అమెరికా పౌరుడు, వామపక్ష మేథావి, కార్యకర్త, అత్యంత ప్రతిభా వంతుడైన వ్యాపారి నెవిల్లీ రాయ్ సింగమ్ కథలోకి ప్రవేశిస్తాడు. ఆయన 'థాట్ వర్క్స్' అనే ఒక అంతర్జాతీయ ఐటీ కన్సల్టెన్సీ కంపెనీ వ్యవస్థాపకుడు, అధినేత. ఈ సంస్థకు భారతదేశంలోనూ ఉద్యోగులున్నారు, కార్యాలయాలున్నాయి. సింగమ్ 2017లో థాట్ వర్క్స్‌ను, బ్రిటన్‌కు చెందిన 'అపాక్స్ పార్ట్‌నర్స్'కు 785 మిలియన్ డాలర్లకు విక్రయించారు. ఈ అమ్మకంతో వచ్చిన డబ్బుతో సింగమ్, అతని టీం సభ్యులు, అమెరికాలో పీపుల్స్ సపోర్ట్ ఫౌండేషన్ లిమిటెడ్ (పిఎస్ఎఫ్) అనే ప్రైవేట్ సంస్థను స్థాపించారు. ఈ పిఎస్ఎఫ్ సంస్థ లాయర్, మేనేజర్ జాసన్ ఫెచర్ సంస్థ తరపున విడుదల చేసిన అధికారిక ప్రకటనలో "పిఎస్ఎఫ్ కు విరాళంగా ఇచ్చిన నిధులన్నీ "థాట్ వర్క్స్" అమ్మకం ద్వారా వచ్చిన నిధుల నుండే వచ్చాయని వెల్లడించారు. పిఎస్ఎఫ్, మరో దేశ ప్రభుత్వం నుండి ఎలాంటి నిధులను స్వీకరించలేదు. వరల్డ్ వైడ్ మీడియా హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ (డబ్ల్యుఎంహెచ్) అనే మరో సంస్థను ఈ ఫౌండేషన్ నిర్వహిస్తుంది. ప్రపంచ వ్యాపితంగా ప్రజల కోణంలో వార్తలను అందించే ప్రగతిశీల మీడియా ప్రాజెక్టులలో వివిధ రకాల పెట్టుబడులు పెట్టి లాభాలు తెచ్చుకునే లక్ష్యంతో ఏర్పాటైన సంస్థ డబ్ల్యుఎంహెచ్.

న్యూయార్క్ టైమ్స్ రాసిందేంటి?

2017 చివరలో డబ్ల్యుఎంహెచ్, 'న్యూస్ క్లిక్'ను తన లక్ష్యాలకనుగుణమైన సంస్థగా గుర్తించింది. పెట్టుబడులు పెట్టడం ప్రారంభించింది. 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపక సంపాదకుడు పుర్కాయస్థ ఎన్నో ఏళ్లు థాట్ వర్క్స్‌లో పని చేసిన వ్యక్తి. కనక దాంట్లో పెట్టుబడి పెట్టవచ్చని డబ్ల్యుఎంహెచ్ నిర్ణయించుకుంది. 2018 మార్చిలో 'న్యూస్ క్లిక్'లో పెట్టుబడి కార్యరూపం దాల్చింది. మరోవైపున 2021 నుండి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సంస్థలు, ముఖ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఢిల్లీ పోలీసు ఆర్థిక నేరాల విభాగం, ఆదాయ పన్ను శాఖ 'న్యూస్ క్లిక్'ను లక్ష్యం చేసుకొని నిరంతర దాడులు, సోదాలు మొదలుపెట్టాయి. అయితే స్వాధీన పర్చుకున్న పరికరాలు, డాక్యుమెంట్లు, ఈమెయిళ్లలో 'మనీ లాండరింగ్', లేదా పన్నుల ఎగవేత వంటి తప్పుడు పనులు చేసిన రుజువులు దొరక్కపోవడంతో ఈ విచారణలు ముందుకు సాగలేదు. ఈ దశలోనే అమెరికా పత్రిక 'న్యూయార్క్ టైమ్స్' తన ప్రత్యేకమైన పరిశోధక కథనంతో రంగప్రవేశం చేసింది. అమెరికా సాంకేతిక కుబేరుని చేరిన చైనా ప్రచారజాలం ("ఏ గ్లోబల్ వెబ్ ఆఫ్ చైనీస్ ప్రోపగాండా లీడ్స్ టు ఏ యూఎస్ టెక్ మొఘల్") అనే శీర్షికతో ఈ కథనం వెలువడింది. అపార నిధులతో చైనా అనుకూల ప్రచార వ్యాప్తి కేంద్ర బిందువుగా ఆకర్షణీయమైన అమెరికా మిలియనీర్, నెవిల్లీ రాయ్ సింగమ్ ఉన్నాడనేది ఈ కథనం సారాంశం. ఈయన వామపక్ష శ్రేయోభిలాషి కావడం ఏదో పెద్ద నేరమైనట్టు ఈ పత్రికా కథనం ఆరోపించింది. ఈ వ్యాసం 'న్యూస్ క్లిక్' గురించి రెండు మామూలు విషయాలే చెప్పింది. చైనా ప్రభుత్వంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ అధికారులు దాడి చేసినా ఎలాంటి రుజువులు దొరక లేదంటూనే సింగమ్ నెట్‌వర్క్ ఈ న్యూస్ క్లిక్ సైట్ కు, పెట్టుబడి పెట్టడాన్ని ప్రస్తావించింది."

అంతేగాని 'న్యూస్ క్లిక్' ఏ చట్టాన్నైనా ఉల్లంఘించిందని ఆ పత్రిక ఆరోపించలేకపోవడం ముఖ్యమైన విషయం. ఎవరైనా శ్రద్ధగా పరిశోధనాత్మకంగా అధ్యయనం చేసి వుంటే 'ఫైనాన్సింగ్' అనేది, డబ్ల్యుఎంహెచ్ పెట్టుబడి రూపంలో ఇచ్చిందని తెలుసుకొని ఉండేవారు. ఆ వివరాలు చట్ట ప్రకారం అధికారులకు అప్పగించినవే. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించినట్లు ఇక్కడ "మనీ లాండరింగ్" ప్రశ్నే లేదు. అందుకే ఢిల్లీ హైకోర్టు కూడా 'న్యూస్ క్లిక్'కు అనుకూలంగా, కంపెనీ బాధ్యులను అరెస్ట్ చేయకుండా తాత్కాలిక రక్షణ కల్పించింది. దీనికి సంబంధించిన ఆదాయ పన్ను అధికారులు చేసిన ఫిర్యాదును కింది కోర్టు కొట్టేసింది. 70 ఏళ్ళ చైనా విప్లవం తర్వాత కాలంలో వచ్చిన మార్పులకు సంబంధించి 2019 అక్టోబర్ 2న పోస్టు చేసిన వీడియో మాత్రమే న్యూయార్క్ టైమ్స్ చూపిన గొప్ప ఆధారం! ఇదే దాని దృష్టిలో చైనా అనుకూల ప్రచారమైంది. నిజానికి న్యూయార్క్ టైమ్స్ కథనం, తీవ్ర భావజాలంతో రాసింది. సమాచారం ముసుగులో ప్రచారం కోసం రాసింది. డబ్ల్యుఎంహెచ్ మేనేజర్, లాయర్ అయిన జాసన్ ఫెచర్‌కు వ్యాసం ప్రచురణకు ముందే రిపోర్టర్లు లేవనెత్తిన ప్రశ్నలకు పిఎస్ఎఫ్ తరపున స్పందించాడు: పిఎస్ఎఫ్ ఎవరి నుంచి ఎలాంటి నిధులను స్వీకరించలేదు, ఏ విదేశీయుని నుండి గానీ, ఏ సంస్థ నుండి గానీ, ఏ రాజకీయ పార్టీ నుండి గానీ, ఏ ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి ఆదేశాలనూ తీసుకోలేదు. పిఎస్ఎఫ్ నిధుల వనరు థాట్ వర్క్స్ అమ్మకం ద్వారా వచ్చినవే. కాని అవి చైనా నుండి వచ్చినట్లు పాఠకులను న్యూయార్క్ టైమ్స్ కథనం వండారని ఫెచర్ స్పష్టం చేశారు.


తీవ్ర ప్రచార దాడి

కాకపోతే మరోసారి 'న్యూస్ క్లిక్'పై దాడి చేయడానికి న్యూయార్క్ టైమ్స్ కథనం అక్కరకు వచ్చింది. ఈసారి ప్రభుత్వం అమెరికా తరహా మెకార్థియన్ ప్రచారం (అంటే కమ్యూనిస్టు వ్యతిరేక సమాచారం), భయానక కథనాలు, విషపు దాడికి పాల్పడింది. సామాజిక మాధ్యమాల ద్వారా హిందూత్వ అనుకూల భక్తులు, ఉన్మాద శక్తులు ఆ కథనంలో చెప్పినట్టు భారతదేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని గగ్గోలు మొదలెట్టారు. అమెరికా పత్రిక ఏదో గొప్ప సంచలనం బయిటపెట్టిందంటూ న్యూస్ క్లిక్‌పై, దాని నిర్వాహకులపై కత్తులు నూరుతున్నారు. సర్కారీ భజనకు పేరు మోసిన రెండు టీవీ ఛానళ్ళు ఈ తప్పుడు ప్రచారానికి వంత పాడుతున్నాయి. దర్యాప్తు సంస్థలు క్రమపద్ధతిలో లీక్ చేస్తున్న సమాచారంతో అభాండాలు కుమ్మరిస్తున్నాయి. ఈ విధంగా తీవ్రవాద నేరంతో కొత్త కేసు మోపడానికి రంగం సిద్ధమైంది.

దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు, న్యాయవాదులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు, ప్రజల నుండి విస్తృతంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. కానీ, ఇదో సంఘటనగానే మాత్రమే అనుకుంటే మీడియా స్వతంత్రత, స్వేచ్ఛను రక్షించే ఉద్యమం విజయవంతం కాదు. ప్రభుత్వ అణచివేతను అనేక మార్గాల్లో ప్రతిఘటించాలి. విష పూరితమైన తప్పుడు సమాచారం, ద్వేషపూరిత ప్రచారా వరణం సాగుతున్న నేటి భావావరణాన్ని ఛేదించాలి.

2014 మే నుండి 19 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. కానీ హంతకులపై చర్యల్లేవు. ఇటీవల 'ద వైర్' పత్రికలో ప్రచురితమైన వ్యాసం ప్రకారం, 16 మంది జర్నలిస్టులపై 'ఉపా చట్టం' కింద కేసులు మోపారు. ఏడుగురు జైళ్ళలో ఉన్నారు, ఇలాంటి ప్రతీ కేసును తీవ్రంగా తీసుకోవాలి. కేవలం స్వతంత్ర జర్నలిస్టులు, విమర్శనాత్మక జర్నలిస్టుల రక్షణకు మాత్రమే కాక, మన రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక స్వేచ్ఛలను రక్షించుకునేలా దీక్షబూనడానికి దారితీయాలి. ఎందుకంటే...ఒక్కరు ప్రమాదంలో పడితే అందరూ పడినట్టే.

("ఫ్రంట్‌లైన్" సౌజన్యంతో)



ఈసారి ప్రభుత్వం అమెరికా తరహా మెకార్థియన్ ప్రచారం (అంటే కమ్యూనిస్టు వ్యతిరేక సమాచారం), భయానక కథనాలు, విషపు దాడికి పాల్పడింది. సామాజిక మాధ్యమాల ద్వారా హిందూత్వ అనుకూల భక్తులు, ఉన్మాద శక్తులు ఆ కథనంలో చెప్పినట్టు భారతదేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని గగ్గోలు మొదలెట్టారు. అమెరికా పత్రిక ఏదో గొప్ప సంచలనం బయిటపెట్టిందంటూ న్యూస్ క్లిక్‌పై, దాని నిర్వాహకులపై కత్తులు నూరుతున్నారు. సర్కారీ భజనకు పేరు మోసిన రెండు టీవీ ఛానళ్ళు ఈ తప్పుడు ప్రచారానికి వంత పాడుతున్నాయి. దర్యాప్తు సంస్థలు క్రమపద్ధతిలో లీక్ చేస్తున్న సమాచారంతో అభాండాలు కుమ్మరిస్తున్నాయి. ఈ విధంగా తీవ్రవాద నేరంతో కొత్త కేసు మోపడానికి రంగం సిద్ధమైంది.

కెనడా కార్మికుల స్థితిగతులు ...

పర్యటన

ఇటీవల మా చిన్నమ్మాయి ఆహ్వానం మేరకు కెనడా లోని టొరంటో నగరానికి వెళ్లాము. ఒక కార్మిక సంఘం కార్యకర్తగా ఆ దేశ ఆర్థిక పరిస్థితులను, కార్మికుల స్థితిగతులను అవగాహన చేసుకునే ప్రయత్నం చేశాను. అందుకు అంతర్జాల (నెట్) మాధ్యమాన్ని, కొన్ని పత్రికలను కూడా ఉపయోగించుకు న్నాను. రెండో రకపు అధ్యయనంలో కార్మికులతో, ప్రజాతంత్ర ఉద్యమ కార్యకర్తలతో మాట్లాడాను. పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థల పరిశీలనకు, కార్మికుల వేతనాల గురించి తెలుసుకోవడానికి కారల్‌మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథం గైడ్‌గా ఉపయోగపడింది.

అక్కడ ఆర్థిక వ్యవస్థ....

కెనడా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ. అభివృద్ధి చెందిన, చెందుతున్న పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థలు ఏవైనా సరే వృత్తాకారంలో ఆర్థిక సంక్షోభాలను పదే పదే ఎదుర్కొంటాయని మార్క్స్ ఆనాడే చెప్పాడు. ప్రభుత్వ లెక్కల ప్రకారం కెనడాలో 2023 ఆగస్టులో నిరుద్యోగం 5.5 శాతం. మన దేశంలో జులైలో నిరుద్యోగం 7.95 శాతం. ఈ లెక్కన కెనడా నిరుద్యోగం ఎక్కువే. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తదితర అభివృద్ధి చెందిన దేశాల్లో ఇటువంటి పరిస్థితులే నెలకొన్నాయి. కెనడాలో నిరుద్యో గులకు నిరుద్యోగ భృతి ఇస్తారు. దాన్ని ఇవ్వటాన్ని బట్టి కూడా నిరుద్యోగాన్ని లెక్కిస్తారు. భిక్షాటన చేసేవారు, ఇళ్లు లేక బాధపడేవారు, చెత్త కాగితాలు ఏరుకునే వారు అక్కడక్కడ కనబడతారు. కెనడా దేశ జనాభా 4 కోట్లు. వైశాల్యంలో ప్రపంచంలో రష్యా తరువాత రెండో పెద్ద దేశం. కానీ జనాభా మన రాష్ట్రం కంటే తక్కువ. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2021లో 38 లక్షల మంది ప్రజలు సరైన ఇంటి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. కార్మికుల చేతుల్లో నుండి సంపదలు వాణిజ్య, తనఖా బ్యాంకర్ల చేతుల్లోకి పోతున్నాయని ప్రజాతంత్ర ఉద్యమ మాధ్యమాలు పేర్కొంటున్నాయి. కెనడా అభివృద్ధి చెందిన ఉన్నత ఆర్థిక వ్యవస్థ. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో దానిది పదో స్థానం. జనాభాలో 1.6 శాతం వ్యవసాయం, 28.2 శాతం పారి శ్రామిక, 70.2 శాతం సర్వీసు రంగాల మీద ఆధారపడ్డారు. పేదరికం దిగువ స్థాయిలో ఉన్నవారు 6.4 శాతం.



పి. అజయ కుమార్

మూలవాసుల పాత్ర నామమాత్రమే...

కెనడా ఆర్థిక వ్యవస్థలో మూలవాసుల పాత్ర నామమాత్రం. దేశ జనాభాలో వీరి వాటా 4.9 శాతం. యూరప్ నుండి పెట్టుబడులు కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు ఎగుమతి అయ్యాయని, పెట్టుబడులతో పాటుగా ఈ దేశాలకు యూరోపియన్లు వచ్చి స్థిరపడ్డారని పెట్టుబడి గ్రంథంలో మార్క్స్ పేర్కొన్నాడు. ఈ క్రమంలో ఈ దేశాల్లో మూలవాసులను ఒక మూలకు నెట్టి, ఘర్షణల్లో చంపి యూరోపియన్లు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది బ్రిటన్ ఆ తర్వాత ఇతర యూరప్ దేశాల నుండి వచ్చినవారు ఈ దేశాల్లో ఉంటారు. పాలకులు కూడా వీరే. అందుకే కెనడాలో ప్రధాన భాష ఇంగ్లీష్, తర్వాత స్థానం ఫ్రెంచ్. ఈ దేశాల్లో నగరాలు కూడా యూరప్ నగరాల పేర్లతో ఉంటాయి. టొరంటో తర్వాత కెనడాలో రెండో అతి పెద్ద నగరం మాంట్రియల్ (ఫ్రాన్స్‌లో కూడా ఈ పేరుతో ఓ నగరముంది). ఈ నగరం ఉన్న క్యూబెక్ ప్రావిన్స్ వైశాల్యంలో అతి పెద్దది. జనాభాలో దానిది రెండో స్థానం. అందుకే ఫ్రెంచ్ భాషది రెండో స్థానం.

కార్మికుల వేతనాలు

ఉన్నత చదువులు చదువుకుని ఫైనాన్స్, ఐ.టి రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు చేసే వారి గురించి నా పరిశీలనలో లేదు. నిర్మాణ రంగం, మాల్స్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీలో పనిచేసే వారిపై కొంత పరిశీలన చేశాను. వేతనాల పరిశీలనకు కూడా మార్క్స్ పెట్టుబడి గ్రంథం గైడ్.

కనీస వేతనాలు ఆయా దేశాల ఆర్థికాభివృద్ధిని బట్టి, జీవన వ్యయాన్ని బట్టి, నాగరికత అభివృద్ధిని బట్టి ఉంటాయని ఆనాడే మార్క్స్ చెప్పాడు. ఆధునిక కెనడా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో జీవన వ్యయం మన దేశంతో పోల్చితే అనేక రెట్లు ఎక్కువ. ఇటువంటి ఆర్థిక వ్యవస్థలో పని చేయాలంటే చదువులు, నైపుణ్యాలు కూడా అధిక స్థాయిలో ఉండాలి.

ఫెడరల్ (కేంద్ర) ప్రభుత్వం, ప్రొవెన్షియల్ (రాష్ట్ర) ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం గత సంవత్సరపు వినిమయ ధరల సూచీ సరాసరిని బట్టి కనీస వేతనాన్ని (గంటకు) ప్రకటిస్తాయి. నేను ఉన్న టొరంటో నగరం ఒంటారియో ప్రావిన్స్‌లో ఉంది. ఈ ప్రావిన్స్‌లో ఈ సంవత్సరం అక్టోబర్ 1 నుండి అమల్లోకి వచ్చిన ఒక గంట పనికి కనీస వేతనం 16.55 కెనడా డాలర్లు. మన రూపాయల్లో సుమారుగా 993. ఈ మొత్తం కేరళ లాంటి రాష్ట్రంలో ఒక రోజుకు వస్తుందనుకుంటే ఇక్కడ గంటకు వస్తుంది. అంటే ఎనిమిది రెట్లు ఎక్కువ. జీవన వ్యయం కూడా నా లెక్కల్లో సరాసరిన దాదాపు అన్ని రెట్లు ఎక్కువ కనబడింది. స్థలాభావం వలన వివిధ సరుకుల రేట్లను ఇక్కడ ప్రస్తావించడం లేదు. అభివృద్ధి చెందిన దేశం కాబట్టి సహజంగానే జీవన ప్రమాణాలు కూడా మన కంటే ఎక్కువ స్థాయిలో ఉంటాయి.

విశ్వవిద్యాలయాల్లో చదవటానికి వచ్చి వివిధ ప్రదేశాల్లో పార్ట్‌టైమ్ వర్కర్లుగా పనిచేసే భారత విద్యార్థులు మాత్రమే తమ వేతనాలను వెల్లడించడానికి సిద్ధపడ్డారు. వీరిలో కొత్తగా చేరిన వారికి గంటకు 12 డాలర్ల నుండి వేతనం ప్రారంభమవుతుంది. 18 సంవత్సరాల్లోపు హైస్కూల్ విద్య పూర్తి చేసి బయటకు వచ్చి పని చేసే కెనడా విద్యార్థులకు ఇతరులకు నిర్ణయించే కనీస వేతనం కంటే ప్రభుత్వమే తక్కువ వేతనాలు నిర్ణయిస్తుంది. నిర్మాణం, విమానాశ్రయాలు తదితర రంగాల్లో కనీస వేతనాల కంటే ఎక్కువ వేతనాలు వస్తాయి.

కార్మికులు - కార్మిక సంఘాలు

కెనడాలో ఉన్న కార్మిక సంఘాల్లో 'కెనడియన్ లేబర్ కాంగ్రెస్' పెద్దది. దీనిలో 30 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల సభ్యులు ఉంటారు. అంతర్జాతీయ స్థాయిలో 'ఇంటర్నే షనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్' (ఐ.టి.యు.సి)కు అనుబంధంగా ఉంది. 10 సంవత్సరాల క్రితం 'కెనడియన్ లేబర్ కాంగ్రెస్' నుండి విడిపోయిన 'యూనిఫర్' సభ్యత్వం మూడు లక్షలు. ఇటీవల అమెరికాలో మోటార్ కార్మికుల సమ్మె జరిగినప్పుడు.... కెనడా లోని మోటార్ కార్మికుల సమ్మె 'యూనిఫర్' నాయకత్వంలోనే సాగింది.

2023 సెప్టెంబర్‌లో 64 వేల మంది కొత్తగా ఉద్యోగాల్లోకి వస్తే వారిలో 48 వేల మంది పార్ట్‌టైమ్ ఉద్యోగులు. సెప్టెంబర్ నాటికి ఉద్యోగాల్లో ఉన్నవారి మొత్తం సంఖ్య 2 కోట్లు దాటింది. శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఉద్యోగాల్లో ఉన్నవారు, ఉద్యోగాల కోసం ఎదురు చూసేవారు) 65.6 శాతం. మన దేశంలో ఇది 57.9 శాతం. కెనడాలో సరాసరి కనీస వేతనం గంటకు 34.01 కెనడా డాలర్లు. యూనియన్‌లో ఉన్నవారు, యూనియన్‌లో లేకపోయినా ఉమ్మడి ఒప్పందాల అమలు పరిధిలో ఉన్నవారు 30.9 శాతం. పర్మినెంట్ ఉద్యోగాల కోసం పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసే వారు 39.5 శాతం. తాత్కాలిక లేదా కాంట్రాక్ట్ ఉద్యోగులు 6.3 శాతం. సరాసరి వేతనంలో 2/3 వంతు కంటే తక్కువ వచ్చే వారి సంఖ్య 19.4 శాతం. వీరిని తక్కువ వేతనాలు వచ్చే వారిగా పరిగణిస్తారు. స్త్రీ, పురుషుల మధ్య ఒక గంట కనీస వేతనంలో తేడా 4.48 డాలర్లు.

రాజకీయాలు...

అధికార పార్టీ లిబరల్ పార్టీ. ప్రతిపక్ష పార్టీగా కన్సర్వేటివ్, మూడో శక్తిగా న్యూ డెమోక్రాటిక్ (ఎన్.డి.పి.) పార్టీలున్నాయి. ఎన్.డి.పి. ప్రస్తుతానికి వామపక్షం కాకుండా, మితవాద పార్టీగా కాకుండా ఉన్నది. ఇది క్రమేపీ మితవాదం వైపు మొగ్గుతోంది. కెనడాలో అతి పెద్ద కార్మిక సంఘం న్యూ డెమోక్రాటిక్ పార్టీ ప్రభావంలో ఉంది. ప్రస్తుతం కార్మిక సంఘాల్లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ కెనడా ప్రభావం తక్కువ. 1940, 1950 ప్రాంతాల్లో పార్లమెంట్‌లో కమ్యూనిస్టులకు కొద్ది సీట్లు ఉండేవి. ఆ కాలంలో కార్మిక సంఘాలపై కమ్యూనిస్టుల ప్రభావం ఉంది. అమెరికాలో కమ్యూనిస్టులపై జరిగిన దుష్ప్రచార ప్రభావం కెనడాపై పడింది. కమ్యూనిస్టులను కార్మిక సంఘాల నుండి బహిష్కరించారు.

అమెరికాలో బ్రిటన్ పాలనకు వ్యతిరేకంగా పెద్ద స్వాతంత్ర్య పోరాటం చేసి విజయం సాధించారు. కెనడాలో దీనికి భిన్నంగా బ్రిటీష్ మహారాణికి విశ్వాసపాత్రులుగా ఉండి స్వాతంత్ర్యం తెచ్చుకున్నారు. అందుకే ఇప్పటికీ కరెన్సీ నోట్లపై మహారాణి ఫోటో ఉంటుంది. ఇప్పుడు కింగ్ ఛార్లెస్ ముద్ర రాబోతోంది. ప్రధాన మంత్రి సలహాపై మహారాణి/రాజు గవర్నర్ జనరల్‌ను నియమిస్తారు. ప్రభుత్వ భూములను కెనడాలో ఇప్పటికీ క్రౌన్ ల్యాండ్స్(రాచ భూములు)గా పిలుస్తారు. అయితే బ్రిటన్ రాణి/రాజు పాత్ర పేరుకు మాత్రమే కొనసాగుతోంది. అధికారాలన్నీ ఎన్నికైన కెనడా ప్రభుత్వానివే.

ఇతర విశేషాలు...

కెనడా పర్యటనలో నా అధ్యయనానికి తోడ్పడిన అంశాలను కూడా ప్రస్తావించాలి. మా అమ్మాయి నివాసం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను ఆనుకొని ఉంది. నివాసం నుండి కిలోమీటర్ నడిస్తే ఓంటారియో మహా సరస్సు వస్తుంది. ఉత్తర అమెరికాలో ఉన్న ఐదు మహా సరస్సుల (గ్రేట్ లేక్స్)లో ఇది ఒకటి. దీని ఒడ్డునే కాలిబాటలు, పార్కులు, లేక్ బోలీవార్డ్స్ (విశాలమైన కాలిబాటలు గల రోడ్లు) ఉంటాయి. ఇష్టమైన రోజువారీ వాకింగ్‌కు ఇది ఉపయోగపడటమేగాక పార్ట్‌టైమ్ ఉద్యోగులతో మాట్లాడే అవకాశం లభించింది.

టొరంటో ట్రాన్స్‌పోర్టు కమిషన్ (ప్రభుత్వ సంస్థ) ఆధ్వర్యంలో సబ్‌వే రైళ్లు, స్ట్రీట్ కార్లు, బస్సులు ఒకదానికి మరోటి సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మంచి సర్వీసునిస్తున్నాయి. నా అధ్యయనానికి ఈ రవాణా కూడా తోడ్పడింది. టొరంటో నగరంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయి.

టొరంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంలో చూసిన వివిధ దేశాల సినిమాలు, ఆర్ట్ షో, ఆర్ట్ గ్యాలరీ, ఒంటారియో మ్యూజియం, బేస్‌బాల్ గేమ్, వైన్ అండ్ డైన్ మా పర్యటనలో ఉన్న అదనపు ఆకర్షణ. కెనడాలో మాదక ద్రవ్యాలు అధికారికంగానే వాడవచ్చు. వాటిని అమ్మే షాపు కూడా చూశాము. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 'మారియోనా'ను సేవించేవారిని చూశాము. మేం చూసిన వాటిలో ఎక్కువ భాగం నడిచి వెళ్లినవే.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

కెనడాలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తారు. దాన్ని ఇవ్వటాన్ని బట్టి కూడా నిరుద్యోగాన్ని లెక్కిస్తారు. భిక్షాటన చేసేవారు, ఇళ్లు లేక బాధపడేవారు, చెత్త కాగితాలు ఏరుకునే వారు అక్కడక్కడ కనబడతారు. కెనడా దేశ జనాభా 4 కోట్లు. వైశాల్యంలో ప్రపంచంలో రష్యా తరువాత రెండో పెద్ద దేశం. కానీ జనాభా మన రాష్ట్రం కంటే తక్కువ. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2021లో 38 లక్షల మంది ప్రజలు సరైన ఇంటి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు.



విద్వేషం చిమ్ముతున్న హిందూత్వ మూకలు !


- ఇజ్రాయిల్ యుద్ధం సాకుతో సోషల్ మీడియాలో సాగుతున్న విష ప్రచారం

ముంబయి : ఇజ్రాయిల్–హమస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని సాకుగా తీసుకుని ఇస్లామోఫోబియాను రెచ్చగొట్టడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. భారత్‌లోనే వందలాది గాజా స్ట్రిప్‌లు వున్నాయని, హమస్ తరహాలో ఇస్లామిస్ట్ దాడులను హిందువులు ఎదుర్కొనే ప్రమాదముందని, అదే జరిగితే వాటి నుండి భారత్‌ను కాపాడగలిగేది ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమేనని బిజెపి అనుకూల మితవాద ఆన్‌లైన్ విభాగాలు తీవ్రంగా ప్రచారం చేస్తున్నాయి. ఇజ్రాయిల్–హమస్ యుద్ధం ముసుగులో తప్పుడు సమాచారంతో బిజెపి ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి.

బిజెపి నేతల పేర్లతో ప్రొ బిజెపి వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ పేజీలు, గ్రూపుల్లో సోషల్ మీడియా యూజర్లు తమ హిందూత్వ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఈ యుద్ధాన్ని ఒక ఆయుధంగా మలుచుకుంటున్నారు. ముస్లింలే ప్రధాన లక్ష్యంగా తమ తుపాకులను ఎక్కుపెడుతున్నారు.

ఫోటోలు, వీడియోలు ఉపయోగిస్తూ, మెసేజ్‌లు పెడుతూ ఈ గ్రూపుల్లో ఇస్లామ్, ముస్లింలే ప్రధానంగా ఈ యుద్ధానికి కారకులంటూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో, పాలస్తీనియన్లను జిహాదీలు, తీవ్రవాదులుగా చిత్రీకరించడం ద్వారా వారు పడుతున్న ఇబ్బందులు, కష్టాలను అమానవీయంగా చూపిస్తున్నారు.

అక్టోబరు 7న దాడులు ప్రారంభమైనప్పటి నుండి 1400మంది ఇజ్రాయిలీలు, దాదాపు 6500 మంది పాలస్తీనియన్లు మరణించారు. పాలస్తీనియన్ మృతుల్లో 2300 మంది చిన్నారులు వున్నారు. పైగా వీరి మరణాలపై గ్రూపుల్లో జోకులు పేలుస్తున్నారు. వారి ఇబ్బందులు, కష్టాలను అపహాస్యం చేసేలానే ఈ జోకులు వుండడమనేది సర్వసాధారణంగా వుంది.



గాజాలోని కుప్పకూలిన భవనాల దృశ్యాలతో కాషాయ మూకల వెకిలి చేష్టలు

కొన్నేళ్లుగా ఇదే ధోరణి : ప్రతీక్

ఇంటర్‌నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ పాలసీ డైరెక్టర్ ప్రతీక్ వాఘ్రే మాట్లాడుతూ, భారతీయ మితవాద వర్గాల్లో ఇటువంటి విస్తృత ధోరణికి సంబంధించిన ప్రచారంలో భాగమే ఈ పోస్టులని వ్యాఖ్యానించారు. "అత్యధికంగా ముస్లింలను అప్పుడప్పుడు ఆధునిక హిందువులను శత్రువుగా లేదా ముప్పుగా చూపించేలా అంతర్జాతీయ సంఘటనలను చొప్పించేటువంటి కచ్చితమైన ధోరణి భారత్‌లో గత కొన్నేళ్ళుగా నెలకొంది." అని ఆయన పేర్కొన్నారు. యూదు రాజ్యమైన ఇజ్రాయిల్, ముస్లింల ఆధిపత్యం కలిగిన పాలస్తీనా మధ్య ఘర్షణ యొక్క మతపరమైన కోణమే ఇందులో ప్రధానంగా వుంటుందని అన్నారు.

విద్వేష గ్రూపులన్నీ కాషాయ మూలాలున్నవే..

ఇజ్రాయిల్ – హమస్ మధ్య దాడులకు సంబంధించి మన దేశంలో సామాజిక మాధ్యమాల్లో చాలా క్రియాశీలకంగా ఉన్న 13 గ్రూపులకు సంబంధించిన సమాచారం విశ్లేషించగా..ఈ గ్రూపులన్నీ కూడా చాలా స్పష్టంగా హిందూత్వ భావజాలానికి, బిజెపి, నరేంద్ర మోడీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు స్పష్టమైన మద్దతునిస్తున్నాయి. వాట్సాప్ గ్రూపుల పేర్లు, ఆలాగే డిస్‌ప్లే ఫోటోలు సాధారణంగా మోడీ, ఆదిత్యనాథ్ ఫోటోలు ద్వారా ఆ మద్దతనేది ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ గ్రూపుల్లో సభ్యుల సంఖ్య దాదాపు 50 నుండి 400 వరకు వుంటోంది. దీనికి తోడు, పలు ఫేస్‌బుక్ పేజీలు, గ్రూపులు కూడా వున్నాయి. అవి కూడా బిజెపి, ఆ పార్టీ నేతలతో గల సంబంధాలను బాహటంగానే ప్రదర్శిస్తున్నాయి.

నాలుగు లక్ష్యాలు

ప్రధానంగా నాలుగు థీమ్స్‌తో ఈ గ్రూపులు సాగించే ప్రచారం వుంటోంది. అవి -పాలస్తీనియన్ల ఇబ్బందులను అమానవీయంగా చిత్రీకరించడం, వారికి మద్దతివ్వడాన్ని చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించడం, ఇజ్రాయిల్–గాజా యుద్ధానికి చారిత్రక భారతీయ పోలికలను తీసుకురావడం, ఇస్లామిస్ట్ దాడి గురించి హిందువులను హెచ్చరించడం, దీనిపై పోరాడే సమర్థత బిజెపి, మోడీలకే వుందని ప్రచారం చేయడం – గా వున్నాయి.

- ఇజ్రాయిలీల దుస్థితిని కాశ్మీరీ హిందువులతో పోలుస్తూ మెసేజ్‌లు పెడుతున్నారు. హమస్ చెరలో వున్న ఇజ్రాయిల్ కుటుంబానికి సంబంధించిన వీడియో ఒకటి వ్యాప్తి చేస్తూ, దాని కింద 'వారి ముఖాల్లో భయాన్ని చూడండి, 1990లో కాశ్మీరీ హిందువుల ముఖాల్లో నెలకొన్న భయమే కనిపిస్తోంది.' అంటూ పోస్టు పెడుతున్నారు. 'భారతీయులు దీన్ని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారమని పిలుస్తారు. వాస్తవానికి ఇస్లామ్ శాంతిని ప్రేమించే మతం' అంటూ వ్యంగంగా ఆ పోస్టు కింద వ్యాఖ్యానిస్తారు. దానితో వారనుకున్న ప్రయోజనం నెరవేరుతుంది. హమస్‌ను హుమయూన్, బాబర్ వంటి 'ఇస్లామిక్ ఆక్రమణదారుల'తో పోలుస్తారు.
- యోగి ఆదిత్యనాథ్ ఫర్ పిఎం 2024 పేరుతో ఒక ఫేస్‌బుక్ పేజీ వుంది. దీనికి 66వేల మంది ఫాలోయర్లు వున్నారు. "హిందూ మహిళలు ఎందుకు ఆత్మాహుతికి పాల్పడ్డారో హమస్ మనకు అర్ధమయ్యేలా చేస్తోంది." అంటూ ఆ పేజి అడ్మినిస్ట్రేటర్ పోస్టు పెట్టారు.
- ఇజ్రాయిల్ యుద్ధం మనకు సంబంధించినదే అని ఈ గ్రూపులు మనల్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తాయి. భారతీయులపై ముఖ్యంగా హిందువులపై ఇస్లామిస్ట్ తీవ్రవాదులు తక్షణమే దాడులు జరుపుతారంటూ భయాందోళనలు రెచ్చగొట్టేలా మెసేజ్‌లు పెడుతున్నారు. ఇజ్రాయిల్ మాదిరిగా భారత్‌లో కూడా భవిష్యత్తులో ఇలాంటి కుట్రలు జరుగుతాయని హెచ్చరిస్తారు. హిందూ మహిళలపై దారుణాలు, అకృత్యాలు జరిగే అవకాశం లేకపోలేదంటూ హెచ్చరిస్తున్నారు. అందువల్ల హిందువులు అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందంటూ స్పష్టం చేసేలా పోస్టులు పెడుతున్నారు. ముఖ్యంగా రెండు విషయాలను గుర్తు పెట్టుకోవాలని, ఆయుధాలు ధరించాలని, ముస్లింలను పూర్తిగా సామాజికంగా బహిష్కరించాలని పిలుపిస్తున్నారు.
- హమస్ దాడులకు కాంగ్రెస్‌ను నిందిస్తూ కూడా వాట్సాప్‌ల్లో చాలా మెసేజ్‌లు కనిపిస్తున్నాయి. మరోవైపు నాథూరాం గాడ్సేను పొగుడుతూ సందేశాలు వస్తున్నాయి. గాడ్సే, మహాత్మా గాంధీని హత్య చేయకపోతే భారత్‌లో 3 వేల కిలోమీటర్ల పొడవునా గాజా స్ట్రిప్ ఏర్పడి వుండేదని వ్యాఖ్యానిస్తున్నారు.
- పాలస్తీనియన్లకు మద్దతివ్వడాన్ని అక్రమంగా, చట్టవిరుద్ధంగా పేర్కొంటున్నారు. పాలస్తీనియన్లకు మద్దతిచ్చే వారిని పాములుగా అభివర్ణిస్తున్నారు. భారత్‌లో అటువంటి పాములకు కొదవే లేదని పేర్కొంటున్నారు.
- ఈ పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యానాల మూల ప్రయోజనం ఒక్కటిగానే వుంటోంది. వీటన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కొనగలిగే వ్యక్తి బిజెపి నేత మోడీ అని నేరుగా పేరు పెట్టి చెప్పకుండా బలవంతుడైన నాయకుడిని ఎన్నుకోవాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిరుద్యోగ భారత్

- పొరుగు దేశాల కంటే ఇక్కడే అధికం
- ప్రపంచబ్యాంక్ నివేదిక

న్యూఢిల్లీ : ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ అధికారంలోకి వచ్చిన మోడీ.. నిరుద్యోగ యువతతో చెడుగుడు ఆడుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా.. ఆ ఖాళీలను అలాగే ఉన్నాయంటూ పార్లమెంట్‌లో కేంద్రం చెప్పుకుంటోంది. నియామకాల వైపు దృష్టిపెట్టడంలేదు. పకోడీలు వేసుకోమనో, మరోకటో అనేసి నిరుత్సాహపరుస్తోంది. మరోవైపు పొరుగు దేశాలతో పోలిస్తే గత సంవత్సరంలో మన దేశంలోనే నిరుద్యోగ రేటు అధికంగా ఉన్నదని ప్రపంచబ్యాంక్ తెలిపింది. నిరుద్యోగ రేటు మన పొరుగున ఉన్న పాకిస్తాన్‌లో 11.3 శాతం, బంగ్లాదేశ్‌లో 12.9 శాతం, భూటాన్‌లో 14.4 శాతం ఉండగా మన దేశంలో 23.22 శాతంగా ఉంది. ప్రపంచబ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం చైనాలో 13.2 శాతం, సిరియాలో 22.1 శాతం, ఇండొనేషియాలో 13 శాతం, మలేసియాలో 11.7 శాతం, వియత్నాంలో 7.4 శాతం, దక్షిణ కొరియాలో 6.4 శాతం, సింగపూర్‌లో 6.1 శాతంగా నిరుద్యోగ రేటు నమోదైంది. అంతర్జాతీయ కార్మిక సంఘం విడుదల చేసిన సమాచారం ఆధారంగా ప్రపంచబ్యాంక్ ఈ వివరాలు వెల్లడించింది. చేసేందుకు పనిలేక, ఉద్యోగం కోసం వెతుకుతున్న 15–24 సంవత్సరాల మధ్య వయసున్న యువతను పరిగణనలోకి తీసుకొని యువతలో నిరుద్యోగ రేటును అంచనా వేస్తారు.

దేశంలో నిరుద్యోగమే అతి పెద్ద సమస్య అని 15–34 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో 36 శాతం మంది అభిప్రాయపడుతున్నారని లోక్‌నీతి–సిఎస్‌డిఎస్ సర్వే తెలిపింది.

ఎరువులపై సబ్సిడీ కోసం రూ.22,303 కోట్లు విడుదల

- కేంద్ర మంత్రివర్గ నిర్ణయం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో



రబీ పంట సీజన్‌లో (2023 అక్టోబరు 1 నుంచి 2024 మార్చి 31) నత్రజని, భాస్వరం, పొటాష్, సల్ఫర్ వంటి వివిధ పోషకాల కోసం పోషక ఆధారిత సబ్సిడీ రేట్లను (ఎన్‌బిఎస్) కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. బుధవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఎరువులపై సబ్సిడీ కోసం రూ.22,303 కోట్లు విడుదలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరిగినా.. రైతులు మాత్రం డిఎపి (డై అమోనియం ఫాస్పేట్) ఎరువును బస్తాకు రూ.1,350 చెల్లించి తీసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ వివరాలు వెల్లడించారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ), ఉత్తరాఖండ్‌లోని జమ్రానీ డ్యామ్ మల్టీపర్పస్ ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన–వేగవంతమైన నీటిపారుదల ప్రయోజన కార్యక్రమం (పిఎంకెఎస్ వై–ఎఐబిపి) కింద, జలవనరులశాఖ కింద చేర్చడానికి ఆమోదించింది. 2028 మార్చి నాటికి రూ.2,584.10 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఉత్తరాఖండ్‌కు రూ.1,557.18 కోట్ల కేంద్ర మద్దతును సిసిఇఎ ఆమోదించింది.

కర్ణాటకలో పులిగోర్ల కలకలం

- ఇప్పటికే బిగ్‌బాస్ ఫేం అరెస్టు
- బిజెపి ఎంపి జగ్గేశ్, నటుడు దర్శన్‌పైనా దర్యాప్తు

బెంగళూరు : కర్ణాటకలో పులిగోర్ల కలకలం రేగుతోంది. పులి గోరు ధరించినందుకు కన్నడ రియాలిటీ షో కంటెస్ట్ వర్తుర్ సంతోష్‌ను ఆదివారం సెట్‌లో నుంచే అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సంతోష్‌కు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించారు. అయితే ఈ అరెస్టు తరువాత రాష్ట్రంలో అనేక మంది ప్రముఖల దగ్గర ఇలాంటి పులిగోర్లు ఉన్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయి. బిజెపి ఎంపి (రాజ్యసభ) జగ్గేశ్, కన్నడ సినీ నటులు దర్శన్, జెడిఎస్ నాయకులు, నటులు, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి కుమారుడు నిఖిల్ కుమారస్వామి, ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేష్, కుణిగల్‌లోని వెంకటేశ్వర స్వామి, చిక్కమగళూరులోని వినయ్ గురూజీ వంటి వారి దగ్గర పులిగోర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరు పులిగోర్లు ధరించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే తాను ధరించిన పులిగోరు నకిలీ దని నిఖిల్ కుమార్ తెలిపారు. కాగా, ఈ ఆరోపణలపై కర్ణాటక అటవీ శాఖకు చెందిన ఉన్నతస్థాయి అధికారుల బృందం వివిధ ప్రాంతాల్లో విచారణ నిర్వహిస్తుంది. అలాంటి వస్తువులు ఉన్నట్లు వెల్లడయితే వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కర్ణాటక పర్యావరణ, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే మాట్లాడుతూ చట్టం ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ వర్తిస్తుందని, ప్రభుత్వం చట్టం ప్రకారం నడుస్తుందని చెప్పారు.

దేశంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం

- వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ నివేదిక

న్యూఢిల్లీ : రాబోయే మూడు దశాబ్దాలలో మన దేశం ప్రపంచంలోనే అత్యధికంగా విద్యుత్‌ను వినియోగించే దేశంగా నిలుస్తుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) విడుదల చేసిన వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ నివేదిక తెలిపింది. 2050 నాటికి మొత్తం ఆఫ్రికాలో కంటే మన దేశంలోనే విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని వివరించింది. నివాస గృహాలలో ఏసీల వినియోగం పెరగడమే దీనికి కారణం. నివేదిక అంచనాల ప్రకారం మన దేశంలో ఇంధన సరఫరా 2022లో 42 ఎక్సాజౌల్స్ (ఈజే)గా ఉండగా అది 2030 నాటికి 53.7 ఈజేగా, 2050 నాటికి 73 ఈజేగా పెరుగుతుంది. మన దేశంలో గత ఐదు దశాబ్దాల కాలంలో 700 వడగాల్పులు వీచాయి. వీటి కారణంగా 17 వేల మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో ఏసీల వాడకం గణనీయంగా పెరగబోతోంది. వాస్తవానికి 2010తో పోలిస్తే ఏసీల వాడకం మూడు రెట్లు పెరిగింది. ప్రతి వంద కుటుంబాలలోనూ 24 కుటుంబాలలో ఏసీలు ఉన్నాయి. 'చల్లదనం పొందాలంటే ఏసీలు వాడాలి. అప్పుడు విద్యుత్ వినియోగం పెరుగుతుంది. విద్యుత్ వినియోగం ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. భారత్‌లో ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలు దాటాయి. దీంతో విద్యుత్ వినియోగం ఇప్పటికే పెరిగింది' అని ఐఈఏ తెలిపింది. 2050 నాటికి దేశంలో ఏసీల వినియోగం తొమ్మిది రెట్లు పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది. టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్ల వినియోగం కూడా పెరుగుతోందని తెలిపింది. కాగా చమురుకు డిమాండ్ కూడా పెరుగుతోంది. 2022లో రోజుకు 5.2 మిలియన్ బ్యారల్స్ చమురును వినియోగించగా అది 2030 నాటికి 6.8 మిలియన్ బ్యారల్స్‌కు, 2050 నాటికి 7.8 మిలియన్ బ్యారల్స్‌కు చేరుతుందని నివేదిక అంచనా వేసింది.

మూడేళ్లలో 21 మందికే ప్రభుత్వోద్యోగాలు !

మధ్యప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వ 'ఘనత'




భోపాల్ : మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో అధికార బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగ సమస్యపై రెండు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో 39 లక్షల మంది నిరుద్యోగ యువత ఉండగా వారిలో గత మూడేళ్లలో కేవలం 21 మందికి మాత్రమే శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. రాష్ట్ర శాసనసభలో 230 స్థానాలు ఉండగా నవంబర్ 17న ఒకే విడతలో పోలింగ్ జరుగుతుంది.

2008 నుండి అంటే గత 16 సంవత్సరాలుగా శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని ప్రభుత్వమే రాష్ట్రాన్ని పాలిస్తోంది. 2018 డిసెంబర్ నుండి 2020 మార్చి వరకూ మాత్రం సీనియర్ నేత కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉంది.

హామీలు...ఆరోపణలు

ప్రధాన పార్టీలు రెండూ ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈ నెల 17న ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఇరవై ఐదు లక్షల రూపాయల ఆరోగ్య బీమా కల్పిస్తామని, కులగణన చేపడతామని, ప్రభుత్వ ఉద్యోగాలలో ఒబిసిలకు 27% కోటా ఇస్తామని, రాష్ట్రంలో ఐపిఎల్ నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ జూన్‌లోనే జబల్‌పూర్ నుండి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, నిరుద్యోగ సమస్య తీవ్రమైందని ఆమె ఆరోపించారు. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 21 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చిందని, ఈ సమాచారాన్ని తన కార్యాలయం మూడుసార్లు ధృవీకరించుకొని వాస్తవమేనని నిర్ధారించిందని ఆమె తెలిపారు.



రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజెపి నేత శివరాజ్ సింగ్ చౌహాన్ గత నెల 30న గిరిజనుల ప్రాబల్యం అధికంగా ఉన్న అలిరాజ్‌పూర్ జిల్లాలో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఓ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు వారు వలస పోవాల్సిన అవసరమే ఉండదని చెప్పారు. కానీ గత సంవత్సరం శాసనసభ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారం 2022 ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రంలో 25.8 లక్షల మంది నిరుద్యోగ యువత నమోదయ్యారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఆ సంఖ్య 38,92,949కి పెరిగింది. దీనినిబట్టి చూస్తే మధ్యప్రదేశ్‌లో ప్రతి నెలా లక్ష మంది నిరుద్యోగులు తయారవుతున్నారు. నమోదైన సుమారు 39 లక్షల నిరుద్యోగుల్లో గత మూడేళ్లలో కేవలం 21 మందికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించగలిగింది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణ కాదు. ఈ సంవత్సరం మార్చి 1వ తేదీన శాసనసభలో కాంగ్రెస్ సభ్యుడు మేవారామ్ జాతవ్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వమే ఈ మేరకు సమాధానం ఇచ్చింది.


జవహార్ సింగ్ కుమార్ | కపిల్ పయిక్రా | బల్బీర్ నగేశ్

ఛత్తీస్‌గఢ్ బరిలో సిపిఎం అభ్యర్థులు


న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం తరుపున పోటీ చేయనున్న ముగ్గురి పేర్లను ఆ పార్టీ బుధవారం ప్రకటించింది. కోర్బా జిల్లాలో కట్ఘోరా నుంచి జవహార్ సింగ్ కుమార్, సూరజ్‌పుర్ జిల్లాలోని భట్గావ్ నుంచి కపిల్ పయిక్రా, సర్గుజ జిల్లా లంద్రా (ఎస్‌టి) నియోజకవర్గం నుంచి బల్బీర్ నగేశ్ పోటీ చేయనున్నట్లు సిపిఎం తెలిపింది.

మిజోరంలో 112 మంది అభ్యర్థులు కోటీశ్వరులే

ఐజ్వాల్ : మిజోరం శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 174 మంది అభ్యర్థుల్లో ఏకంగా 112 మంది కోటీశ్వరులే. వీరిలో అమ్ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆండ్రూ లాల్‌రెమ్కిమా పచావ్ అత్యంత ధనవంతుడు. ఆయన ఆస్తి విలువ సుమారు రూ.69 కోట్లు. అభ్యర్థుల్లో 64.4% మంది తమకు కోటి రూపాయలు, ఆపై విలువ కలిగిన ఆస్తులు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించారు. పచావ్ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఆర్.వాన్‌లాల్‌తుంగాకు రూ.55.6 కోట్ల విలువైన ఆస్తులు, జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ అభ్యర్థి హెచ్.జంజలాలాకు రూ.26.9 కోట్ల ఆస్తులు ఉన్నాయి. సెర్‌చిప్ స్థానం నుండి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రామ్‌లున్–ఎడెనా తన చరాస్తుల విలువ కేవలం రూ.1,500 మాత్రమేనని అఫిడవిట్‌తో తెలియజేశారు.

ఐదు రాష్ట్రాల్లో అధికారం మాదే

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే



కలబర్గీ (కర్నాటక) : వచ్చే నెలలో శాసనసభ ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఆయన చెప్పారు. కర్నాటకలోని కలబర్గీలో ఖర్గే బుధవారం ఏఎన్‌ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఛత్తీస్‌ఘర్, రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ పని తాము సజావుగానే చేసుకుంటున్నాయని, ఆయా రాష్ట్రాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేవని అన్నారు. ఎన్నికలకు పార్టీ సిద్ధంగా ఉన్నదని, అన్ని రాష్ట్రాల్లోనూ విజయం తమకే లభిస్తుందన్న విశ్వాసంతో ఉన్నామని తెలిపారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యల కారణంగా బీజేపీ ప్రజల నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటోందని చెప్పారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందని ఖర్గే ఆరోపించారు. 'బీజేపీ ప్రభుత్వం ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ ఒక్క దానిని కూడా నెరవేర్చలేదు. అది నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం కానివ్వండి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం కానివ్వండి. పెట్టుబడులు కానివ్వండి' అని అన్నారు. కర్నాటకను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రానికి కేంద్ర ప్రాజెక్టులేవీ రాలేదని ఖర్గే గుర్తు చేశారు.

రాజస్థాన్‌లోనూ గృహలక్ష్మి

- ఇంటి పెద్దకు ప్రతిఏటా రూ. 10 వేల నగదు : అశోక్ గెహ్లాట్ హామీ

జైపూర్ : రాజస్థాన్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే 'గృహ లక్ష్మీ గ్యారంటీ'ను అమలు చేస్తామని, కుటుంబంలోని మహిళా పెద్దకు ప్రతీ ఏటా రూ. 10 వేల నగదు అందిస్తామని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బుధవారం హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు వంట గ్యాస్ సిలెండరును రూ.500కు ఇస్తామని అశోక్ గెహ్లాట్ వాగ్దానం చేశారు. రాష్ట్రంలోని జుంజును వద్ద బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో ముఖ్యమంత్రి ఈ హామీలు ఇచ్చారు. 200 మంది ఎమ్మెల్యేలు ఉన్న రాజస్థాన్‌లో నవంబర్ 25న ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 3న ఫలితాలు వెల్లడించనున్నారు.

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి కళ్లెం వేసేదెలా?

- హిజ్బుల్లా, హమస్, ఇస్లామిక్ జిహాద్ అధినేతల భేటీ

జెరూసలేం, గాజా : లెబనాన్‌కి చెందిన హిజ్బుల్లా సాయుధ గ్రూపు అధిపతి పాలస్తీనా సాయుధ గ్రూపులైన హమస్, ఇస్లామిక్ జిహాద్ అధినేతలు బుధవారం సమావేశమయ్యారు. అమెరికా, బ్రిటన్ తదితర దేశాల అండతో యుద్ధోన్మాదంతో ఊగిపోతూ గాజాపై తీవ్రస్థాయిలో వైమానిక దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌ను నిలువరింపజేయడం ఎలా అనే అంశంపైనే వీరు ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు హిజ్బుల్లా ఒక ప్రకటన చేసింది. బుధవారం జరిగిన ఈ సమావేశంలో హిజ్బుల్లా నేత సయ్యద్ హసన్ నస్రల్లా, హమస్ డిప్యూటీ చీఫ్ సాలే అల్ అరౌరి, ఇస్లామిక్ జిహాద్ చీఫ్ జియాద్ అల్ నఖాలాలు పాల్గొన్నారు. అయితే ఈ సమావేశం ఎక్కడ జరిగిందనే వివరాలు తెలియరాలేదు. ఆపరేషన్ ఆల్ అక్సా ఫ్లడ్ ప్రారంభమైన దగ్గర నుండి చోటు చేసుకున్న తాజా పరిణామాలను వారు చర్చించారు. ఈ దాడిలో ఇజ్రాయిల్‌లో 1400 మంది మరణించగా, గాజాలో 6500 మంది చనిపోయారు. గాజా, వెస్ట్ బ్యాంక్‌లో అణచివేతకు గురవుతున్న ప్రజలపై జరుగుతున్న దారుణమైన దాడులను నిలువరించి, మొత్తంగా ఇజ్రాయిల్‌పై విజయం సాధించేందుకు గానూ ఈ కీలకమైన దశలో తీసుకోవాల్సిన చర్యలపై, వైఖరులపై చర్చించారని ఆ ప్రకటన పేర్కొంది. ఈ నెల 7న దాడులు ప్రారంభమైనప్పటి నుండి దాదాపు రోజూ ఇజ్రాయిల్–లెబనాన్ సరిహద్దు పొడవునా ఇజ్రాయిల్ బలగాలు, హిజ్బుల్లా మధ్య కాల్పులు జరుగుతునే వున్నాయి.


గుర్తు తెలియని ప్రాంతంలో సమావేశమైన హిజ్బుల్లా, హమస్, ఇస్లామిక్ జిహాద్ అధినేతలు

మణిపూర్‌లో గన్ కల్చర్

- గత ఏడేళ్లలో 35,117 గన్‌లైసెన్సులు

ఇంఫాల్ : బిజెపి పాలిత రాష్ట్రం మణిపూర్‌లో గన్ కల్చర్ రాజ్యమేలుతున్నది. బీరెన్‌సింగ్ సర్కారు హయాంలో ఇది తీవ్రరూపం దాల్చింది. గత ఏడేండ్ల ఎన్డీయే పాలనలో రాష్ట్రంలో 35 వేలకు పైగా యాక్టివ్ గన్ లైసెన్సులు జారీ అయ్యాయి. ఈశాన్య భారతంలోని రాష్ట్రాల్లో ఇదే అధికం కావటం గమనార్హం. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఈ సమాచారం వెల్లడైంది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలవారీగా జారీ అయిన గన్ లైసెన్సులకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఈ సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 20 నాటికి 37.7 లక్షల యాక్టివ్ గన్ లైసెన్సులు ఉన్నాయి. 2016, డిసెంబర్ నాటికి ఉన్న లైసెన్సుల సంఖ్య కంటే ఇది 4 లక్షల కంటే అధికం కావటం గమనార్హం. ప్రస్తుత సమాచారం ప్రకారం మణిపూర్‌లో 35,117 యాక్టివ్ గన్ లైసెన్సులు ఉన్నాయి. 2016, డిసెంబర్ నాటికి ఈ సంఖ్య 26,836గా ఉన్నది. కాగా, మణిపూర్‌లో 2017, మార్చిలో బీజేపీ నేతృత్వంలోని ఎన్. బీరెన్‌సింగ్ సర్కారు కొలువుదీరింది. దీంతో దాదాపు అప్పటి నుంచి రాష్ట్రంలో సుమారు 8 వేలకు పైగా గన్ లైసెన్సులు పెరిగిపోవటం గమనార్హం. మణిపూర్‌లో ఈ గన్ లైసెన్సుల సంఖ్య ఈశాన్య భారత్‌లోని మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువ కావటం ఆందోళన కలిగిస్తున్నది. ఇక ఈ విషయంలో నాగాలాండ్ మణిపూర్‌తో పోటీలో ఉన్నది. ఈశాన్యంలో మణిపూర్ తర్వాత నాగాలాండ్ అధిక సంఖ్యలో యాక్టివ్ గన్ లైసెన్సులను కలిగి ఉన్నది.

మణిపూర్‌లో గన్ లైసెన్సుల సంఖ్య పెరిగిపోవటంపై మణిపూర్ మాజీ పోలీసు కమిషనరల్ రాజ్ కుమార్ నీమయ్ ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఆయన తప్పుబట్టారు. గన్‌ల సంఖ్య పెరిగిపోవటంపై అసోం మాజీ డీజీపీ జి.ఎం. శ్రీవాస్తవ సైతం స్పందించారు. పొరుగు దేశాల నుంచి లైసెన్స్ లేని గన్‌లు సరఫరా అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

గాజాలో స్థంభించిన ఆరోగ్య వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

చేరిందని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. వీరిలో 2,704 మంది పిల్లలు వున్నారు. ఇప్పటివరకు 17 వేల మందికిపైగా గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాడుల్లో పాత్రికేయులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. పాలస్తీనా జర్నలిస్టు సయీద్ అల్ హలాబి బుధవారం ఉత్తర గాజాలో జరిగిన బాంబు దాడిలో మరణించారు. ఇప్పటివరకు 21 మంది పాలస్తీనా జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు ఇజ్రాయిల్, ఒక లెబనాన్ జర్నలిస్టు కూడా చనిపోయారు. గాజాలో ఇజ్రాయిల్ సాగించే యుద్ధంలో ఎలాంటి ప్రత్యక్ష ప్రమేయం వద్దని ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతాహ్ అల్ సిసి తన మిలటరీని హెచ్చరించారు. ఆ దిశగా తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. సంక్షోభ సమయాల్లో హేతుబద్ధంగా, సంయమనంతో వ్యవహరించే చరిత్ర ఈజిప్ట్ ఆర్మీకి వుందని అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం

- రక్తమార్పిడిలో నిర్లక్ష్యం
- 14 మంది చిన్నారులకు హెచ్ఐవి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం చోటు చేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తమార్పిడి చేసే సమయంలో నిర్లక్ష్యం 14 మంది చిన్నారుల జీవితాలను ప్రమాదంలో పడేసింది. కలుషిత రక్తం ఎక్కించడం వల్ల చిన్నారులకు హెచ్ఐవి, హెపటైటిస్ బి, సి సోకినట్లు తేలింది. రాష్ట్రంలోని కాన్పూర్‌కు చెందిన లాలా లజపతిరాయ్ ఆసుపత్రిలో ఈ దారుణ ఘటన జరిగింది. 14 మంది బాధిత చిన్నారులు తలసేమియాతో బాధపడుతున్నారు. వీరికి ఎప్పటికప్పుడు రక్తమార్పిడి అవసరం. ఈ క్రమంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని లాలా లజపతిరాయ్ ఆసుపత్రిలో రక్తమార్పిడి చేయించుకున్నారు. అయితే రక్త మార్పిడిలో నిర్లక్ష్యం వలన వీరిలో ఏడుమందికి హెపటైటిస్ బి, ఐదుగురికి హైపటైటిస్ సి, ఇద్దరికి హెచ్ఐవి సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఈ పిల్లలంతా ఆరు నుంచి 16 ఏళ్ల మధ్య వయసు వారే. ఇప్పటికే తలసేమియా తో బాధపడుతోన్న వీరిని ఈ వైరస్‌లు మరింత ఇబ్బందిపెడతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ పిల్లలంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. ఈ దారుణంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. 'మన ఆరోగ్య వ్యవస్థను డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మరింత అనారోగ్యంగా మార్చింది. ఇంతటి దారుణమైన నిర్లక్ష్య వైఖరి సిగ్గుచేటు.' అని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు.




మీకోసం

మరుగుతున్న సాంబారులో ఒక చెంచా నిమ్మరసం కలిపితే చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

ఆలోచించి తీసుకున్న నిర్ణయం, కష్టపడి తెచ్చుకున్న అవకాశం, ఓటమి తర్వాత వచ్చే అనుభవం, గొప్ప వ్యక్తిత్వం వల్ల వచ్చే అభిమానం ఎప్పటికీ వృథా పోవు.

స్నేహితులు




రాజు, రమేష్ ప్రాణ స్నేహితులు. స్కూల్లో కూడా బాగా చదువుకుంటారు. అర్థంకాని పాఠాలు ఒకరికొకరు చెప్పుకుంటారు. ఓ రోజు రమేష్ పాఠశాలకు రాలేదు. అప్పుడు వాళ్ల తరగతి గదికి సోషల్ సార్ వచ్చారు. 'రేపు పరీక్ష ఉంటుంది. అందరూ రాయాలి. రాయకుంటే కఠిన చర్యలు ఉంటాయి' అని చెప్పి వెళ్ళారు.

ఆ రోజు పాఠశాల అయిపోగానే రమేష్ ఇంటికి వెళ్ళాడు రాజు. బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లానని రమేష్ చెప్పాడు. ఆ రోజు క్లాసులో ఏం పాఠాలు జరిగాయని అడిగాడు. 'రేపు సోషల్ పరీక్ష ఉంది. సార్ చెప్పారు. పరీక్ష బాగా రాయకపోతే ఊరుకోనని కచ్చితంగా చెప్పారు. ఈ విషయం చెబుదామనే నేను వచ్చాను. ఇదిగో ఈ పాఠంలోని ప్రశ్నలు బాగా చదువుకో' అని చెప్పేసి రాజు వెళ్లిపోయాడు.

మరుసటి రోజు సోషల్ పరీక్షకు అందరూ హాజరయ్యారు. రమేష్ కూడా పరీక్ష రాశాడు. అది చూసిన సార్ 'రమేష్, ఈ పాఠంలోని ప్రశ్నలే పరీక్షకు ఉంటాయని నీకెలా తెలుసు?' అని అడిగారు. 'రాజు చెప్పాడు సార్.' అన్నాడు రమేష్. 'స్నేహితులు అంటే ఇలా ఉండాలి. ఒక రోజు తరగతికి రాకపోయినా ఆరోజు ఏమి చెప్పారో ఒకరికొకరు తెలుసుకోవాలి. మీరు అందరూ కూడా రాజు, రమేష్‌లా స్నేహంగా ఉండాలి' అన్నారు సోషల్ సార్. 'సరే సార్' అన్నారు పిల్లలందరూ ముక్తకంఠంతో. '

- కనుమ ఎల్లారెడ్డి,
93915 23027



సరైన పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు ఇచ్చాం. ఆంగ్లంలో వాటిని ఏమంటారో కింద ఇచ్చిన గళ్లల్లో రాయండి. బాణం గుర్తు పెట్టిన బాక్సుల్లో ఉన్న అక్షరాలను కింద ఇచ్చిన బాక్సులో వరుసగా రాసి చూడండి.

నేను గీసిన బొమ్మ



బి.పరిమళ,
4వ తరగతి,
జక్కాపూర్,
సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కుటుంబాలను కూల్చేసిన విద్వేషం!

> కుల, మత విద్వేషం అనేది విచక్షణ ఎరుగని ఒక చిచ్చు. అది మానవత్వాన్ని కాల్చేస్తుంది. మానవ సంబంధాలను కూల్చేస్తోంది. భార్యాభర్తలను సైతం విడదీస్తోంది. మణిపూర్లో తెగల మధ్య చెలరేగిన కార్చిచ్చు ఎన్నో దాడులకు, దారుణాలకు దారి తీసింది. అమానవీయ సంఘటనలకు, హత్యాచారాలకు ఆజ్యం పోసింది. వేర్వేరు తెగల మధ్య ఏర్పడ్డ వివాహ బంధాలు విచ్ఛిన్నం కావటానికి కారణమైన ఉదంతాలు ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నాయి.

మణిపూర్‌లో మే నుండి వరుసగా జరుగుతున్న అల్లర్లలో ఎన్నో జంటలు విడిపోయాయి. ప్రాణభయంతో మృత్యుకుహరంలో భార్యబిడ్డలను విడిచి పెట్టేసిన కొంతమంది భర్తలు తమ దారి తాము చూసుకుంటే.. ఉపాధి కోసం దూరప్రాంతాలకు వెళ్లిన కొంతమంది భర్తలు దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. రెండు కులాల మధ్య చెలరేగిన ఈ ఘర్షణల్లో తలో దిక్కూ పారిపోతున్న వారిలో కులాంతర వివాహాలు చేసుకున్న కుకీ-మెయితీల జంటలు ఎన్నో ఉన్నాయి. భాగస్వామిని కోల్పోయిన లేక విడిచిపెట్టడం వల్ల ఒంటరిగా మిగిలిపోయిన ఆ మహిళలు, పిల్లల భవిష్యత్తు ఇప్పుడు అంధ:కారంలో చిక్కుకుపోయింది.

చురచందపూర్‌లోని బెతెల్ గ్రామ నివాసి కుకీ తెగకు చెందిన మహిళ కిమ్ హాకిప్. ఆగస్టులో ఆమె తన ఏడేళ్ల వివాహబంధం నుండి దూరంగా నెట్టివేయబడింది. మెయితీ వర్గానికి చెందిన ఆమె భర్త దాడుల భయంతో రాత్రికి రాత్రే ఎవరికీ చెప్పకుండా శరణార్థిగా మిజోరాం పారిపోయాడు. ఆ గ్రామం మెయితీ ఆధిపత్యం ఉన్న గ్రామం. కుకీ మహిళను పెళ్లి చేసుకున్నానని తనవారే తనకు హాని చేస్తారని భావించి నన్ను, పిల్లలను ఇక్కడే వదిలేసి అతను వెళ్లిపోయాడు. మూడు నెలలు నేను ఇంట్లోనే బందీలా ఉండిపోయాను. కొన్ని వారాల పాటు ఇక్కడ దాడులు తీవ్రంగా జరిగాయి. ఈ ద్వేషం మా జంటను విడదీస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. పరిస్థితులు ఎప్పటికి కుదుటపడతాయో.. నా భర్త మళ్లీ ఇక్కడికి వస్తాడో లేదో తెలియదు. పిల్లలు స్కూలుకు వెళ్లడం లేదు. నా దగ్గరున్న డబ్బు అంతా ఖర్చయిపోయింది' అంటున్న హాకిప్ కుకీ తెగకు చెందిందన్న విషయం ఇరుగుపొరుగుకు అంతగా తెలియదు. ఎప్పుడైతే ఆమె భర్త విడిచిపెట్టి పోయాడో అప్పటి నుండి ఆమెను అనుమానించడం మొదలుపెట్టారు. ఆ సమయంలో 'అప్పటికే ఇంట్లో ఉన్న సరుకులు మొత్తం అయిపోయాయి. పిల్లలను బతికించుకోవాలంటే ముందు నేను ఇక్కడి నుండి బయటపడాలి. ఆర్మీలో పనిచేస్తున్న బంధువుల సాయంతో ఎలాగోలా సురక్షిత ప్రాంతానికైతే చేరుకున్నాను. అయితే, అక్కడ నేను వచ్చిన ప్రాంతంలో కుకీ-మెయితీ జంటలు ఎన్నో ఉన్నాయి. వారంతా ఎలా ఉన్నారో.. ఏమైందో.. తెలియదు. ప్రాణాలతో బయటపడ్డా నా జీవితమేమీ సుఖాంతం కాలేదు' అంటూ నీళ్లు నిండిన కళ్లతో చెబుతోంది.





ఈ ఘర్షణలు సద్దుమణిగాయి అనుకున్న వేళ సోషల్ మీడియాలో వెలుగు చూసిన ఇద్దరు విద్యార్థుల దారుణ హత్యతో మళ్లీ రాజుకున్నాయి. ఆ సందర్భంలో అప్పటి వరకు స్నేహితులుగా మెలిగిన కుకీ-మెయితీ విద్యార్థులు ఇంతకుముందులా లేరని అంటోంది 18 ఏళ్ల మోనికా కాయా. 'కాలేజీలో నాకు చాలామంది స్నేహితులు ఉన్నారు. వాళ్లల్లో కుకీలు ఎవరు? మెయితీలు ఎవరు అని నేను ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ ఆ హత్యలు చూసిన తరువాత నా పక్కనున్న వాళ్లని కూడా అనుమానించాల్సి వస్తోంది. ఇట్లాంటి పరిస్థితుల్లో ఎన్నాళ్ల నుండో ఇష్టపడుతూ వివాహం ద్వారా ఒక్కటవుదామన్న ఎంతోమంది విద్యార్థులు వాళ్ల నిర్ణయాన్ని మార్చుకోవడం నాకు తెలుసు. స్నేహం కంటే ప్రేమ బలమైనదని నమ్మే మా యువత కూడా వేరే తెగ వ్యక్తితో వివాహబంధం కొనసాగించడానికి ధైర్యం చేయడం లేద'ని మోనిక వాపోతోంది.

చురచందపూర్‌లో నివసిస్తున 48 ఏళ్ల లాల్నుమావి కిటికీ దగ్గర కూర్చొని రోడ్డువైపే చాలా విచారంగా చూస్తోంది. ఆమె భర్త బస్సు డ్రైవరు. 'పెళ్లయిన కొత్తల్లో నన్ను చూసేందుకు ఈ గ్రామం నుండి ఒక్క ట్రిప్పైనా వేసేవాడు. నేను ప్రతి రోజూ ఇక్కడే అతని కోసం ఎదురుచూసేదాన్ని. మూడేళ్లపాటు ఇలాగే సాగింది. మాకు నలుగురు పిల్లలు. అందరూ 18 నుండి 28 ఏళ్ల వయసువారు. ఇప్పుడు నా భర్త వయసు 60 ఏళ్లు. దాడుల భయంతో అతను మమ్మల్ని వదిలి వంద కిలోమీటర్ల దూరానికి పారిపోయాడు. ఇంతవరకు తిరిగి రాలేదు. వస్తాడో రాడో కూడా తెలియదు. నా పిల్లలు అర్ధంతరంగా చదువు మానేశారు. వాళ్లను ఎలా పోషించాలో నాకు తెలియదు. నా జీవితంలో ప్రతి ఒక్కదాన్ని కోల్పోయాను' అంటూ విచార వదనంతో ఆమె చెబుతోంది.



రెబెకా (38) కుకీ మహిళ. మెయితీ తెగకు చెందిన భర్తతో కలిసి ఉంటున్న ఆమె ఇంటిని దాడుల గుంపు ఛిన్నాభిన్నం చేసింది. అడ్డొచ్చిన భర్తను కాల్చి చంపింది. 'నేను నా సర్వస్వం కోల్పోయాను. పుట్టిన నేలను, కుటుంబాన్ని, నా గుర్తింపును ఇలా ప్రతి ఒక్కదాన్ని పోగొట్టుకున్నాను. ఇప్పుడు అక్కడ నాకంటూ ఏమీ లేదు' అంటూ శరణార్థి శిబిరంలో ఆశ్రయం పొందుతున్న రెబెకా చెబుతున్నప్పుడు ఆమె కళ్లు శూన్యంలోకి చూస్తున్నాయి.

చురచందపూర్ పాత బజార్. 31 ఏళ్ల అన్నా గోడకు ఆనుకుని కూర్చొని ఉంది. ఆమె కళ్లు తడిబారి ఉన్నాయి. అప్పుడే తన ఆరేళ్ల చిన్న కూతురు బొమ్మ ఫోను పట్టుకుని అమ్మ పక్కన కూర్చొంటూ నాన్నతో మాట్లాడుతున్నట్లు నటిస్తోంది. 'అమ్మా నాన్న ఎప్పుడు వస్తారు? మేమిద్దరం షాపుకు వెళ్లి చాక్లెట్లు కొనుక్కోవాలి' అంటూ పక్కనే ఉన్న అమ్మను కుదుపుతూ అడుగుతోంది. ఆ పిల్ల అలా అడుగుతున్నప్పుడు అప్పటికే తడి నిండిన అన్నా కళ్లనీళ్లు కట్టలు తెంచుకున్న కాలువలా చెంపలపై జారాయి. రెండు చేతులతో తన చెంపలను తుడుచుకుంటూ ఆ పిల్లను హత్తుకుంది అన్నా. ఎప్పటికీ కనపడని తండ్రి గురించి ఆ పిల్లతో ఏం చెప్పాలో తెలియక ఆ తల్లి హృదయం కన్నీటి సంద్రంలో కొట్టుకుపోతోంది.

అన్నా భర్త లుంగ్నిలాల్ ఇంఫాల్‌లో పనిచేస్తున్నాడు. అద్దె ఇంట్లో తన కుకీ బృందంతో కలసి జీవిస్తున్నాడు. దాడులు మొదలైన రెండో రోజు లుంగ్నిలాల్ నుండి అన్నాకు ఫోను వచ్చింది. 'అప్పుడు అర్ధరాత్రి.. అతను ఫోన్లో ఏదో చెబుతున్నాడు. నాకు అర్థం కాలేదు. అక్కడ పరిస్థితులు బాగోలేవని, గ్రామానికి వచ్చేస్తానని చాలా చిన్న స్వరంతో మాట్లాడాడు. ఆ తెల్లవారే మెయితీ గుంపు ఆ ఇంట్లో ఉన్న కుకీలందరినీ బయటికి లాగి మరీ హతమార్చింది. 14 ఏళ్ల వయసులో నేను అతన్ని చూశాను. నాకోసమే అతని కళ్లు వెదికేవి. ఐదేళ్లపాటు మేం ప్రేమించుకున్నాం. మా వివాహమై ఇప్పటికి ముప్పయ్ ఏళ్లు. పిల్లలతో, భర్తతో హాయిగా ఉంటున్న నా జీవితాన్ని ఈ విధ్వంసం తలకిందులు చేసింది. నాన్న లేడన్న నిజాన్ని పిల్లలకు చెప్పే ధైర్యం నాకు లేదు. చిన్న పిల్ల ఇంకా నాన్న కోసం ఎదురు చూడని రోజు లేదు' అంటూ వెక్కిళ్లపడుతూ అన్నా చెబుతోంది.

33 ఏళ్ల తరువాత ...



రజనీకాంత్ 170వ చిత్రంలో భారీ తారాగణం నటించబోతోంది. బాలీవుడ్ నటుడు అమితాబ్ కూడా ఇందులో భాగమయ్యారు. ఈ సందర్భంగా రజనీకాంత్ 33 సంవత్సరాల తర్వాత నా మెంటర్ అమితాబ్‌తో కలిసి నటిస్తున్నానని నాకు చాలా ఆనందంగా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్టు చేసి తన సంతోషాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తుండగా, జ్ఞానవేల్ రాజా దర్శకత్వం వహించనున్నారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ బుధవారం చెన్నైలో ప్రారంభమైంది. తెలుగు నుంచి రానా దగ్గుబాటి, మలయాళం నుంచి ఫహాద్ ఫాజిల్, మంజూ వారియర్ వంటి నటులు ఈ చిత్రంలో నటించనున్నారు.

నవంబర్‌లో 'కాలింగ్ సహస్త్ర'



సుధీర్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కాలింగ్ సహస్త్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వెంకటేశ్వర్లు కాటూరి మాట్లాడుతూ, 'నిర్మాతలుగా ఇది మాకు ఇదొక స్వీట్ మెమరీ. డైరెక్టర్ అరుణ్, హీరో సుధీర్, హీరోయిన్‌గా డాలీషా సపోర్ట్‌తో సినిమాను పూర్తి చేశాం. ఔట్ పుట్ సూపర్‌గా వచ్చింది. సరికొత్త సుధీర్‌ను చూస్తారు. ప్రేక్షకులు ఊహించని మలుపులతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది. నవంబర్‌లో సినిమాను విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.

అద్వయ్ హీరోగా సుబ్రహ్మణ్య



నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్, రచయిత, ఫిల్మ్ మేకర్ రవిశంకర్ తన కుమారుడు అద్వయ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. ఎస్.జి మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల సంయుక్తంగా 'సుబ్రహ్మణ్య'ని నిర్మించనున్నారు. ప్రవీణ కడియాల, రామలక్ష్మి సమర్పిస్తున్నారు. రాజ్‌తోట డీవోపీగానూ, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. మస్తీ డైలాగ్స్ అందిస్తున్న ఈ చిత్రానికి విజయ్ ఎం కుమార్ ఎడిటర్. మెహర్ వివేక్ వెచ్చా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఉల్లాస్ హైదూర్ ప్రొడక్షన్ డిజైనర్. నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి.



ఫ్రెంచ్ సినిమాలో ...

సీనియర్ నటి రాధిక ఓ విదేశీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఇన్‌స్టాలో ఆమె ఓ పోస్ట్ పెట్టారు. 'సినీ కెరీర్‌లో కొత్త ప్రయాణం మొదలైంది. ఫ్రెంచ్ సినిమాలో నటిస్తున్నాను. తొలి రోజు షూటింగ్‌లో పాల్గొన్నాను. కొత్త అనుభూతిని పొందుతున్నా. ఈ విషయంలో నా భర్త శరత్‌కుమార్ ఎంతో ప్రోత్సహించారు' అంటూ ఆయనకు థ్యాంక్స్ చెప్పారు. షూటింగ్ ఫొటోలను కూడా షేర్ చేశారు.



'జపాన్' నుంచి 'టచ్చింగ్' పాట

హీరో కార్తి తన 25వ చిత్రంగా 'జపాన్' చేస్తున్నారు. రాజు మురుగన్ దర్శకత్వం. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాని తెలుగు రాష్ట్రాలలో విడుదల చేయనుంది. ఇటీవలే చిత్ర నిర్మాతలు టీజర్ విడుదల చేశారు. తాజాగా సంగీత కార్యక్రమాలను ప్రారంభించారు. ఫస్ట్ సింగిల్ 'టచ్చింగ్...టచ్చింగ్' పాటని విడుదల చేశారు. జివి ప్రకాష్ కుమార్ ఈ పాటకు సంగీతాన్ని అందించారు. హీరో కార్తి, సింగర్ ఇంద్రావతి చౌహాన్‌తో కలిసి స్వయంగా ఈ పాటని ఆలపించారు. భాస్కరభట్ల రాశారు. అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్. సునీల్ కీలక పాత్రలో నటిస్తున్నారు. విజయ్ మిల్టన్ ఈ సినిమాతో తొలిసారిగా నటుడిగా పరిచయమవుతున్నారు. దీపావళికి ఈ సినిమా విడుదల కానుంది.



నరసింహ నంది 'ప్రభుత్వ సారాయి దుకాణం'

'1940లో ఒక గ్రామం, కమలతో నా ప్రయాణం, లజ్జ, జాతీయ రహదారి' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన నరసింహ నంది తాజాగా మరో ఆసక్తికరమైన టైటిల్‌తో సినిమా చేయబోతున్నారు. 'ప్రభుత్వ సారాయి దుకాణం' అనే టైటిల్‌తో ఈ చిత్రం తెరకెక్కబోతోంది. శ్రీలక్ష్మి నరసింహ పతాకంపై తెరకెక్కనున్న ఈ సినిమా బుధవారం ప్రారంభమైంది. 'షేక్స్పియర్ కథలోని పాత్రల ఆధారంగా తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా.. పగ, ద్వేషం, ఈర్ష్య, అసూయ, ప్రేమ మనిషిలోని వివిధ కోణాలను చూపిస్తూ ఈ సినిమా కథను తయారు చేసుకున్నాను' అని నరసింహ చెప్పారు. అదితి మైఖేల్, వినయ్, మల్లిక్, నరేష్ గౌడ్, మహంతి, వీరభద్రం, బాలు నాయక్ తదితరులు నటిస్తున్నారు.

మ్యాక్స్‌వెల్ విధ్వంసం

- 40బంతుల్లోనే సెంచరీతో రికార్డు
- వార్నర్ సెంచరీ
- జంపాకు నాలుగు వికెట్లు
- నెదర్లాండ్స్‌పై 309పరుగుల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు



న్యూఢిల్లీ: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఐదుసార్లు టైటిల్ విజేత ఆస్ట్రేలియా జూలు విదిలించింది. అరుణ్‌జైట్లీ స్టేడియంలో బుధవారం నెదర్లాండ్స్‌పై తొలిగా బ్యాటింగ్‌కు దిగి 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 399 పరుగులు భారీస్కోర్ నమోదు చేసింది. వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు ఇది రెండో అత్యుత్తమ స్కోర్. డేవిడ్ వార్నర్ (104; 93బంతుల్లో 11ఫోర్లు, 3సిక్సర్లు), మ్యాక్స్‌వెల్(106; 44బంతుల్లో 9ఫోర్లు, 8సిక్సర్లు)కి తోడు స్టీవ్ స్మిత్ (71; 68బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్), మార్నస్ లబూషేన్ (62; 47బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) అర్ధ శతకాలతో మెరిసారు. ఛేదనలో ఆసీస్ బౌలర్ల ధాటికి పసికూన నెదర్లాండ్స్ జట్టు 21 ఓవర్లలో 90పరుగులకే కుప్పకూలింది.

అంతకుముందు ఆస్ట్రేలియా ఓపెనర్ మిచెల్ మార్ష్(9)ను వాన్ బీక్ త్వరగా వెనక్కి పంపినా.. మరో ఎండ్‌లో ఉన్న వార్నర్ ఆరంభం నుంచీ నిలకడగా ఆడాడు. ఆర్యన్‌దత్ వేసిన మూడో ఓవర్‌లో డేవిడ్ వార్నర్ వరుసగా నాలుగు ఫోర్లు బాది భారీస్కోర్‌కు పునాది వేశాడు. మార్ష్.. అకెర్మాన్‌కు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరగా.. తర్వాత క్రీజులోకి వచ్చిన స్మిత్.. తొలుత నెమ్మదిగా ఆడినా.. ఆ తర్వాత దూకుడు పెంచాడు. పాల్ వాన్ మీకెరెన్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు రాబట్టిన అతడు.. వాన్ బీక్ వేసిన 10ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. తర్వాత వార్నర్ కూడా దూకుడు పెంచాడు. అకెర్మాన్ బౌలింగ్‌లో సిక్స్ బాదగా.. విక్రమ్‌జిత్ వేసిన 18 ఓవర్‌లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి అర్ధ శతకం (40బంతుల్లో) అందుకున్నాడు. ఆర్యన్‌దత్ వేసిన 24 ఓవర్‌లో స్మిత్.. వాన్ డెర్ మెర్వే చేతికి చిక్కి ఔటయ్యాడు. ఆ తర్వాత లబుషేన్ ఆరంభంలో నెమ్మదిగా ఆడి.. మెర్వే వేసిన 34ఓవర్‌లో ఓ సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. బాస్ డి లీడే వేసిన తర్వాతి ఓవర్‌లో అర్ధ శతకం అందుకున్నాడు. ఆర్యన్‌దత్ వేసిన 36 ఓవర్‌లో వరుసగా ఓ సిక్స్, ఫోర్ బాది కొద్దిసేపటికే వెనుదిరిగాడు. మరోవైపు.. 60 బంతుల్లో 78 పరుగులు చేసిన వార్నర్.. లబుషేన్ వచ్చిన తర్వాత నెమ్మదిగా ఆడి బాస్ డి లీడే బౌలింగ్‌లో ఫోర్ బాది సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇదే ఓవర్లో ఇంగ్లిస్(14) సిబ్రాండ్‌కు చేతిలో ఔటయ్యాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో వాన్ బీక్‌కు నాలుగు, డి లీడేకు రెండు, ఆర్యన్‌దత్ ఒక వికెట్ దక్కాయి.

400 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు 15 ఓవర్ల లోపే ఐదు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. హెజిల్‌వుడ్ వేసిన రెండో ఓవర్లో మ్యాక్స్ ఓడౌడ్(6) ఓ ఫోర్ కొట్టగా విక్రమ్‌జిత్ సింగ్ కూడా రెండు బౌండరీలు బాదాడు. స్టార్క్ వేసిన 3వ ఓవర్లో విక్రమ్‌జిత్.. మరో రెండు ఫోర్లు కొట్టాడు. కానీ మిచెల్ స్టార్క్ డచ్ జట్టుకు తొలి షాకిచ్చాడు. అతడు వేసిన ఐదో ఓవర్లో ఐదో బంతికి ఓడౌడ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మరుసటి ఓవర్లో విక్రమ్‌జిత్ సింగ్ (25 బంతుల్లో 25, 6 ఫోర్లు) రనౌట్ అయ్యాడు. మ్యాక్స్‌వెల్ సూపర్ త్రో తో విక్రమ్ ఔటయ్యాడు. 11 బంతుల్లో 10 పరుగులు చేసిన కొలిన్ అకెర్మన్‌ను హెజిల్‌వుడ్ పదో ఓవర్లో రెండో బంతికి ఎల్బీగా ఔట్ చేశాడు. దీంతో నెదర్లాండ్స్ 14 ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసింది. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఒక్కరూ క్రీజ్‌లో నిలదొక్కుకొనే అవకాశం ఆసీస్ బౌలర్లు ఇవ్వలేదు. జంపాకు నాలుగు, మార్ష్‌కు రెండు, స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్‌కు దక్కింది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
ఇంగ్లండ్ × శ్రీలంక
(వేదిక: బెంగళూరు; మ.2.00గం॥లకు)

వన్డేల్లో టాప్-5 చెత్త బౌలింగ్ గణాంకాలు..

2/115(10)	బెస్ డి లీడే(నెదర్లాండ్స్)..	ఆస్ట్రేలియాపై(2023)
0/113(10)	మెక్ లూవీస్(ఆస్ట్రేలియా)	దక్షిణాఫ్రికాపై(2006)
0/113(10)	ఆడం జంపా(ఆస్ట్రేలియా)	దక్షిణాఫ్రికాపై(2023)
0/110(10)	వాహబ్ రియాజ్(పాకిస్తాన్)	ఇంగ్లండ్‌పై(2016)
0/110(9)	రషీద్‌ఖాన్(ఆఫ్ఘనిస్తాన్)	ఇంగ్లండ్‌పై(2019)

వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా అత్యధిక స్కోర్స్...

417/6	ఆఫ్ఘనిస్తాన్‌పై(పెర్త్-2015)
399/8	నెదర్లాండ్స్‌పై(ఢిల్లీ-2023)
381/5	బంగ్లాదేశ్‌పై(నాటింగ్‌హామ్-2019)
377/8	దక్షిణాఫ్రికాపై(బెస్సెటెర్రీ-2007)
376/9	శ్రీలంకపై(సిడ్నీ-2015)

వన్డేల్లో అత్యధిక పరుగుల తేడాతో విజయాలు..

317	భారత్ (శ్రీలంకపై, త్రివేంద్రం 2023)
309	ఆస్ట్రేలియా (నెదర్లాండ్స్‌పై, ఢిల్లీ 2023)
304	జింబాబ్వే (యుఏఇపై, హరారే 2023)
290	న్యూజిలాండ్ (ఐర్లాండ్‌పై, అబెర్డీన్ 2008)
275	ఆస్ట్రేలియా (ఆఫ్ఘనిస్తాన్‌పై, పెర్త్ 2015)

2వ ర్యాంక్ ఎగబాకిన గిల్

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) బుధవారం విడుదల చేసిన వన్డే బ్యాటర్స్ జాబితాలో శుభ్‌మన్ గిల్ 823 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్న బాబర్ అజామ్(పాకిస్తాన్) కంటే 6పాయింట్లు వెనుకంజలో ఉన్నాడు. బాబర్ అజమ్ 829రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. శుభ్‌మన్ 823పాయింట్లతో రెండోస్థానంలో ఉన్నాడు. ఇక దక్షిణాఫ్రికా ఓపెనర్, వికెట్ కీపర్ క్వింటర్ డికాక్ 3వ ర్యాంక్, హెన్రిక్ క్లాసెన్ 4వ ర్యాంక్‌లకు ఎగబాకారు.

లక్ష్యసేన్, శ్రీకాంత్‌కు నిరాశ

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సూపర్-750లో పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ ప్రత్యర్థుల చేతిలో వరుససెట్లలో ఓటమిపాలయ్యారు. కిదాంబి శ్రీకాంత్ 17-21, 18-21తో జూనియర్ పొపొవ్(ఫ్రాన్స్) చేతిలో, లక్ష్యసేన్ 15-21, 18-21తో ఆర్నండ్ మెర్కెలే(ఫ్రాన్స్) చేతిలో ఓడారు. ఈ టోర్నీకి భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ గాయం కారణంగా దూరంగా ఉన్న సంగతి తెలిసిందే.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	5	5	0	10	+1.35
2.	దక్షిణాఫ్రికా	5	4	1	8	+2.37
3.	న్యూజిలాండ్	5	5	1	8	+1.48
4.	ఆస్ట్రేలియా	5	3	2	6	+1.14
5.	పాకిస్తాన్	5	2	3	4	-0.40
6.	ఆఫ్ఘనిస్తాన్	5	2	3	4	-0.96
7.	శ్రీలంక	4	1	3	2	-1.04
8.	ఇంగ్లండ్	4	1	3	2	-1.24
9.	బంగ్లాదేశ్	5	1	4	2	-1.25
10.	నెదర్లాండ్స్	5	1	4	2	-1.90

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68